epaper.samayamdaily.net
APTEL/26/A3949
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక
SAMAYAM

సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక
**విలేకరులు కావలెను**
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.
**7036644111, 9490140565**

సంపుటి: 1 | సంచిక: 68 | ఎడిటర్ : అలీ ముర్తుజా | గురువారం 10 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |



## రైల్వే విస్తరణకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- ఐదు రాష్ట్రాల్లోని 14 జిల్లాలకు ప్రయోజనం
- తెలుగు రాష్ట్రాలకూ భారీగా లబ్ధి

4



## భారతరత్నకు 'సర్' కష్టాలు

4

ఒక్క అక్షరం తేడాతో చిక్కులు!
ఈసీ నోటీసులు పంపినట్లు ప్రచారం

### మా ఆదేశాలనే ధిక్కరిస్తారా..
## అంత ధైర్యం ఎలా వచ్చింది?

- చర్యలు వద్దని చెప్పినా ఎలా ఇచ్చారని ప్రశ్న
- మేజిస్ట్రేట్ తీరుపై ధర్మాసనం మండిపాటు
- జిల్లా అధికారుల నుంచి వివరణ కోరనున్న కోర్టు
- నోటీసును వెనక్కి తీసుకున్నట్లు వెల్లడి

విద్యార్థికి నోటీసుపై సుప్రీంకోర్టు ఆగ్రహం

4



# ప్రజల జీవితాల్లో వెలుగులే మా లక్ష్యం

**భూములకు రక్షణ కల్పించడమే కూటమి ప్రభుత్వ ఎజెండా**

- గత పాలకుల భూదాహంతో రెవెన్యూ వ్యవస్థ నిర్వీర్యం
- పి.గన్నవరం 'మీ భూమిఉ మీ హక్కు' సభలో సీఎం చంద్రబాబుపనిచేయాలి

**అమలాపురం (సమయం న్యూస్):** ప్రతి నెలా 9వ తేదీన 'మీ భూమి – మీ హక్కు' కార్యక్రమం ద్వారా రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌బుక్‌లను అందజేస్తున్నామని సీఎం తెలిపారు. భూమిపై యజమానులకు తిరుగులేని హక్కులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత పాలకులు రెవెన్యూ వ్యవస్థను ధ్వంసం చేసి రికార్డులను తారుమారు చేశారని, ల్యాండ్ టైటిలింగ్ చట్టం పేరుతో ప్రజల భూములను కాజేసేందుకు కుట్ర పన్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం రాగానే ఆ చట్టాన్ని రద్దు చేసిందన్నారు. రీసర్వే పేరుతో

మిగతా 2 లో



ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు మూలమంత్రాలతోనే కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సచివాలయానికి పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య ఉంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపడమే అసలైన సుపరిపాలన అని ఉద్ఘాటించారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గంలోని పండువారిపేటలో బుధవారం నిర్వహించిన 'మీ భూమి – మీ హక్కు' గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.



## ప్రతీకారానికి ఒక్క నిమిషం చాలు!

.. వివరాలు 2లో

మూడేళ్ల క్రితం నాటి అరెస్టును గుర్తుచేసుకున్న సీఎం చంద్రబాబు

- ఆస్తి కోసం తల్లిని, చెల్లిని మోసం చేస్తున్న వ్యక్తితో రాజకీయాలు
- నా అరెస్టు సమయంలో అండగా నిలిచిన పవన్ కల్యాణ్
- కోనసీమ జిల్లా పర్యటనలో గత పాలకుల తీరుపై ఫైర్



## రాష్ట్రాభివృద్ధిలో ఎన్నారైలది కీలకపాత్ర!

- గ్లోబల్ ఎన్నారై టీడీపీ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం
- ఏపీ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలన్న నారా లోకేశ్

3

చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు..
53 కొవ్వొత్తులతో సంఘీభావం



## వైసీపీ పతనానికి అదే నాంది!

2

- రాజకీయ కక్షసాధింపుతోనే ఆ పార్టీకి ఈ గతి
- జైలులో పెట్టినా ప్రజల గుండెల్లో ఆయన స్థానం పదిలం
- చంద్రబాబు అరెస్టుపై మంత్రి అచ్చెన్నాయుడు



## ఏపీలో స్థానిక సమరం!

- 11న ఫోటోలతో కూడిన ఓటర్ల జాబితా ప్రదర్శన

.. వివరాలు 2లో

## ఈవీల కొనుగోలుపై బంపర్ ఆఫర్!

- ఎక్స్‌షోరూమ్ ధరలో ఐదు శాతం రాయితీ
- ఐదేళ్ల పాటు రోడ్ ట్యాక్స్ మినహాయింపు
- ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీతో కొనుగోలుదారులకు ప్రోత్సాహకాలు
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

2



## వారి భక్తులకు బీమా ధీమా!

- తిరుమలలో మృతి చెందితే కుటుంబానికి రూ. 2 లక్షలు
- ప్రమాదవశాత్తు చనిపోతే రూ. 10 లక్షలు
- 15న బ్రహ్మోత్సవాలు.. పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం

3



## బడుల్లో సెల్‌ఫోన్లను నిషేధించాలి!

● పద్దెనిమిదేళ్ల లోపు వారికి సోషల్ మీడియా కట్ ● వెంకయ్యనాయుడు



దేశంలో సాంస్కృతిక, నైతిక విలువలను పరిరక్షించుకోవాల్సిన తక్షణ ఆవశ్యకత ఉందని, అందుకోసం పాఠశాల విద్య నుంచే విద్యార్థులకు 'నైతిక విలువల తరగతులు' తప్పనిసరి చేయాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో ఆ సంస్థ పాతిక సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన మీడియా మిత్రుల ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు.

3

# ఏపీలో స్థానిక సమరం!

**పోలింగ్ కేంద్రాల ఖరారు షెడ్యూల్ విడుదల**

**11న ఫోటోలతో కూడిన ఓటర్ల జాబితా ప్రదర్శన**

**ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ఈసీ సన్నాహాలు**

**అమరావతి (సమయం న్యూస్):** ఏపీలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు ముమ్మరం చేసింది. స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఖరారు కోసం తాజాగా షెడ్యూల్ విడుదల చేసింది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 11న ఫోటో సహిత ఓటర్ల జాబితాను ప్రదర్శించనున్నారు. 15వ తేదీన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను రూపొందించనున్నారు. రాబోయే ఎన్నికలకు సంబంధించి ఫోటోలతో కూడిన పూర్తిస్థాయి ఓటర్ల జాబితాలను తక్షణమే సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో ఎటువంటి లోపాలకు తావులేకుండా పక్కాగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. స్థానిక పోరుకు ఎన్నికల సంఘం వడివడిగా అడుగులు వేస్తుండటంతో అధికార యంత్రాంగం ఆ దిశగా కసరత్తు ప్రారంభించింది.


# నేటి నుంచి కలెక్టర్ల సదస్సు!

**సచివాలయంలో రెండు రోజుల పాటు భేటీ**

**సూపర్ సిక్స్, పాలనా సంస్కరణలపై సమీక్ష**

**దిశానిర్దేశం చేయనున్న సీఎం చంద్రబాబు**

**అమరావతి (సమయం న్యూస్):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో ఎనిమిదో జిల్లా కలెక్టర్ల సదస్సు రెండు రోజుల పాటు జరగనుంది. సెప్టెంబర్ 10, 11 తేదీల్లో నిర్వహించే ఈ కీలక భేటీకి జిల్లా కలెక్టర్లతో పాటు మంత్రులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, వివిధ శాఖల విభాగాధిపతులు హాజరుకానున్నారు. గతంలో నిర్వహించిన ఏడో కలెక్టర్ల సదస్సు నిర్ణయాలపై చేపట్టిన చర్యల నివేదికతో మొదటి రోజు సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఆర్థిక వృద్ధి, సంక్షేమం, మానవాభివృద్ధి, సాంకేతికత, పెట్టుబడులు, శాంతిభద్రతలు వంటి విభాగాలపై సీఎం సమీక్షించి, క్షేత్రస్థాయి పాలనపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శనం చేయనున్నారు.



**తొలిరోజు విజన్ రోడ్‌మ్యాప్‌పై..**

ఈ సదస్సులో రెండు రోజుల పాటు మొత్తం 19 కీలక అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. మొదటి రోజు జీఎస్డీపీ, స్వర్ణాంధ్ర విజన్‌కు సంబంధించిన జిల్లా స్థాయి రోడ్‌మ్యాప్‌లను సమీక్షిస్తారు. సూపర్ సిక్స్ పథకాలు, తాగునీరు, గృహనిర్మాణం, వైద్యారోగ్యం, విద్యా రంగాల్లో పురోగతి, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, జలధార వంటి అంశాలపై చర్చిస్తారు. జిల్లాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను పలువురు కలెక్టర్లు ఈ వేదికగా ప్రదర్శించనున్నారు. రెండో రోజు సదస్సులో ఈ-గవర్నెన్స్, ఫైళ్ల సత్వర పరిష్కారం, ఆర్టీజీఎస్ పనితీరు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, జిల్లాల వారీ ర్యాంకింగ్స్‌పై చర్చిస్తారు. ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, కేంద్ర నిధుల వినియోగం, నైపుణ్యాభివృద్ధి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలపై అధికారులతో సమీక్షించి సీఎం దిశానిర్దేశం చేయనున్నారు.

# ఈవీల కొనుగోలుపై బంపర్ ఆఫర్!

**ఎక్స్‌షోరూమ్ ధరలో ఐదు శాతం రాయితీ**

**ఐదేళ్ల పాటు రోడ్ ట్యాక్స్ మినహాయింపు**

**ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీతో కొనుగోలుదారులకు ప్రోత్సాహకాలు**

**రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

**అమరావతి (సమయం న్యూస్):** రాష్ట్రంలో విద్యుత్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని మరింతగా పెంచేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. 2024ఉ29 సస్టెయినబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ ద్వారా విద్యుత్ వాహనాల తయారీదారులతో పాటు కొనుగోలుదారులకు కూడా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. విద్యుత్ ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు, రవాణా వాహనాలు, ట్రాక్టర్ల కొనుగోలుపై ఎక్స్‌షోరూమ్ ధరలో ఐదు శాతం వరకు రాయితీ కల్పించామని, ఈ ప్రోత్సాహకం 2027 మార్చి వరకు వర్తిస్తుందని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో రిజిస్టర్ చేసుకునే విద్యుత్ వాహనాలకు ఐదేళ్లపాటు రోడ్ ట్యాక్స్ మినహాయింపు కల్పించడం ద్వారా ప్రజలు ఈవీల వైపు మళ్లేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా తొలి 5,000 ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఖర్చులో 25 శాతం వరకు, గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు ( ఎ్ో తా్ ్ర ఎ ా క ం అందిస్తున్నామన్నారు.




**అగ్రగామిగా తీర్చిదిద్దుతాం..**

దేశంలో విద్యుత్ వాహనాల విక్రయాలు వేగంగా పెరుగుతున్నాయని, ఆగస్టులో సుమారు 2.98 లక్షల ఈవీలు అమ్ముడుపోయాయని మంత్రి గుర్తుచేశారు. గతేడాదితో పోలిస్తే 52.9 శాతం వృద్ధి నమోదు కావడం ఈ రంగానికి పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమన్నారు. 2029 నాటికి రాష్ట్రంలో రెండు లక్షల విద్యుత్ ద్విచక్ర వాహనాలు, కనీసం 10 వేల త్రిచక్ర వాహనాలు, 20 వేల కొత్త విద్యుత్ కార్లను ప్రోత్సహించడంతో పాటు ప్రజా రవాణాలో ఈవీల వినియోగాన్ని విస్తరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ఛార్జింగ్ స్టేషన్ తీసుకురావడం, ఈ-మొబిలిటీ నగరాల అభివృద్ధి లాంటి చర్యలు పర్యావరణహిత రవాణా వ్యవస్థకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగంలో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

# ప్రజల జీవితాల్లో వెలుగులే మా లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి..)

గత ప్రభుత్వం చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని, పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములపై కూడా గత సీఎం ఫోటోలు వేసుకున్నారని విమర్శించారు. ఇష్టం లేని వ్యక్తుల భూములను 22ఏ జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. ఇప్పుడు పటిష్టమైన రీసర్వే పూర్తి చేసి బ్లాక్‌చైన్ టెక్నాలజీ, ఈ-కేవైసీ, క్యూఆర్ కోడ్ వంటి భద్రతా ఫీచర్లతో పాస్‌బుక్‌లు ఇస్తున్నామన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి 56 లక్షల పాస్‌బుక్‌లు పంపిణీ చేస్తామని సీఎం ప్రకటించారు.

**రూ. 1000కే స్టాంప్ డ్యూటీ..**

వారసత్వ భూముల విభజనకు స్టాంప్ డ్యూటీని కేవలం రూ. 1000కి పరిమితం చేయడం ద్వారా 1.25 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చామన్నారు. 22ఏ జాబితా నుంచి 16 లక్షల ఎకరాలను తొలగించి లక్షలాది మందికి ఊరట కల్పించామన్నారు. శెట్టిపల్లి, కంగుండి, ముదినేపల్లి వంటి ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఉన్న 244 భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రాపురంలో బ్రిటిష్ కాలం నాటి నిషేధిత భూముల సమస్యను కూడా పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఇదే వేదికగా



రూ. 240 కోట్ల వ్యయంతో ఈపీడీసీఎల్ చేపట్టే గ్రిడ్ ఆధునీకరణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటా హరీష్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ప్రతీకారానికి ఒక్క నిమిషం చాలు!

- **మూడేళ్ల క్రితం నాటి అరెస్టును గుర్తుచేసుకున్న సీఎం చంద్రబాబు**
- **ఆస్తి కోసం తల్లిని, చెల్లిని మోసం చేస్తున్న వ్యక్తితో రాజకీయాలు**
- **నా అరెస్టు సమయంలో అండగా నిలిచిన పవన్ కల్యాణ్**
- **కోనసీమ జిల్లా పర్యటనలో గత పాలకుల తీరుపై ఫైర్**

**పి.గన్నవరం (సమయం న్యూస్):** ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కేవలం సచివాలయానికే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య ఉంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గంలోని పండువారిపేటలో రూ. 240 కోట్లతో ఈపీడీసీఎల్ చేపట్టే గ్రిడ్ ఆధునీకరణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మూడేళ్ల క్రితం సరిగ్గా ఇదే రోజున (సెప్టెంబర్ 9) తనను అక్రమంగా అరెస్టు చేసిన ఘటనను సీఎం ఈ సందర్భంగా గుర్తుచేసుకుని గత పాలకుల తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

**ఆయన గురించి ఆనాడే చెప్పా..**

తన 48 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో రాజమండ్రి జైలుకు వెళ్తానని ఎన్నడూ అనుకోలేదని సీఎం ఉద్వేగానికి గురయ్యారు. తాను తలుచుకుంటే ప్రతీకారం తీర్చుకోవడానికి ఒక్క నిమిషం చాలని, కానీ తాను ఆ పని చేయబోనని స్పష్టం చేశారు. తాను అక్రమంగా అరెస్టు అయిన సమయంలో అండగా నిలిచేందుకు వస్తున్న పవన్ కల్యాణ్‌ను సైతం అడ్డుకున్నారని గుర్తుచేశారు. రాజకీయాలపై కుటుంబం ఆధారపడకూడదనే 36 ఏళ్ల క్రితమే వ్యాపారం ప్రారంభించి తన సతీమణికి అప్పగించానన్నారు. మాజీ సీఎం జగన్ వ్యవహారశైలిపై అప్పట్లోనే వైఎస్సార్‌ను హెచ్చరించానని, ఆయన సైతం తన కొడుకును ఏపీకి రానివ్వకుండా బెంగళూరుకే పరిమితం చేశారని వ్యాఖ్యానించారు. సొంత బాబాయ్ వివేకానందరెడ్డిని కిరాతకంగా చంపేశారని, ఇప్పుడు ఆస్తుల కోసం కన్నతల్లిని, సొంత చెల్లిని కూడా మోసం చేస్తున్నారని జగన్‌పై సీఎం నిప్పులు చెరిగారు. ఇలాంటి వ్యక్తులతో రాజకీయం చేయాల్సిన దుస్థితి దాపురించిందన్నారు.

# రాష్ట్రాభివృద్ధిలో ఎన్నారైలది కీలకపాత్ర!

**గ్లోబల్ ఎన్నారై టీడీపీ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం**

**ఏపీ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలన్న నారా లోకేశ్**

**అమరావతి (సమయం న్యూస్):** ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రవాసులు కేవలం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని వీక్షించే వారిగా మిగిలిపోకుండా, ప్రజాసేవలో క్రియాశీల భాగస్వాములు కావాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. గ్లోబల్ ఎన్నారై టీడీపీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రవాసులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, రాష్ట్ర అభివృద్ధికి వారి భాగస్వామ్యాన్ని అందించడంతో పాటు పార్టీ సంస్థాగత బలాన్ని పటిష్టం చేయడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. ఉన్నత విద్యావంతులు, పారిశ్రామికవేత్తలు తమ విజ్ఞానాన్ని, అంతర్జాతీయ అనుభవాన్ని రాష్ట్ర అభివృద్ధికి వినియోగించుకునేలా పార్టీ అనేక వేదికలను ఏర్పాటు చేస్తోందని లోకేశ్ వివరించారు. గ్లోబల్ ఎన్నారై టీడీపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ శ్రీ గురు రాజాను కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా తెరవెనుక ఆయన అందించిన సేవలను ప్రశంసించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎన్నారై కేడర్‌ను ఏకం చేసి ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి కృషి చేస్తానని డాక్టర్ గురు రాజా ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన కార్యవర్గం సైతం రాష్ట్ర ప్రభుత్వం, పార్టీ నాయకత్వంతో సమన్వయంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేసింది.

**ఆ కష్టకాలం ఎప్పటికీ గుర్తుంటుంది..**

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజమండ్రి సెంట్రల్ జైలులో గడిపిన 53 రోజుల క్లిష్ట పరిస్థితులను లోకేశ్ గుర్తు చేసుకున్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా అదే జైలులో మౌలిక వసతుల కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాలపై ఆయన పేరు ఉండటం, చివరకు అక్కడే ఆయన నిర్బంధించబడటం ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో ఐ యామ్ విత్ సీబీఎన్ ప్రచారానికి అద్భుతమైన స్పందన వచ్చిందని, హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రాటిట్యూడ్ కచేరీకి ఏకంగా యాభై వేల మంది తెలుగు ప్రజలు హాజరై సంఘీభావం తెలిపారని గుర్తు చేశారు.

**నిజం గెలిచింది.. నీతి నిలిచింది!**

రాజకీయ దురుద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మూడేళ్ల క్రితం సరిగ్గా ఇదే రోజున (సెప్టెంబర్ తొమ్మిదిన) అర్ధరాత్రి వేళ అరెస్టు చేశారని లోకేశ్ గుర్తుచేశారు. ఆయనను యాభై మూడు రోజుల పాటు జైలులో నిర్బంధించిన దానికి నిరసనగా.. ఉండవల్లి నివాసంలో లోకేశ్ యాభై మూడు కొవ్వొత్తులు వెలిగించారు. 'నిజం గెలిచింది.. నీతి నిలిచింది' అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు సైతం కొవ్వొత్తులు వెలిగించి చంద్రబాబుకు సంఘీభావం తెలుపుతున్నారన్నారు. ఐదు దశాబ్దాల నిస్వార్థ రాజకీయ విలువల శిఖరమైన చంద్రబాబు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది తెలుగు ప్రజల ఆశీస్సులతో కడిగిన ముత్యంలా బయటకు వచ్చారని ఆయన పేర్కొన్నారు. ప్రజా బలమే పార్టీకి, చంద్రబాబుకు శ్రీరామరక్ష అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు.



# వైసీపీ పతనానికి అదే నాంది!

- **రాజకీయ కక్షసాధింపుతోనే ఆ పార్టీకి ఈ గతి**
- **జైలులో పెట్టినా ప్రజల గుండెల్లో ఆయన స్థానం పదిలం**
- **చంద్రబాబు అరెస్టుపై మంత్రి అచ్చెన్నాయుడు**




**కోటబొమ్మాళి (సమయం న్యూస్):** సెప్టెంబర్ తొమ్మిదో తేదీ తెలుగుజాతి చరిత్రలో ఎన్నటికీ మరచిపోలేని చీకటి రోజుగా మిగిలిపోతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపుతో పన్నిన కుట్రలే చివరకు ఆ పార్టీ పతనానికి నాంది పలికాయని విమర్శించారు. మూడేళ్ల క్రితం రాజకీయ కక్షసాధింపుతోనే టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై తప్పుడు కేసులు నమోదు చేసి నిర్బంధించారని మంత్రి ధ్వజమెత్తారు. ఆయనను జైలుకు పంపడం ద్వారా గొంతును అణచివేయవచ్చని, పార్టీని బలహీనపరచవచ్చని అప్పటి పాలకులు భావించారని అన్నారు. అయితే చంద్రబాబును జైలులో పెట్టగలిగారు కానీ, ప్రజల గుండెల్లో ఆయనపై ఉన్న విశ్వాసాన్ని మాత్రం బంధించలేకపోయారని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఆ కక్షసాధింపునకు వ్యతిరేకంగా యావత్ తెలుగుజాతి ఏకమై నిలిచిందని, దేశ విదేశాల్లో ఉన్న తెలుగు ప్రజలు సైతం అండగా నిలిచి సంఘీభావాన్ని చాటారని గుర్తుచేశారు. ఎన్ని ఇబ్బందులు, నిర్బంధాలు ఎదురైనా చంద్రబాబు ప్రజల పక్షాన నిలిచి పోరాడారని అన్నారు.

**అహంకారానికి బుద్ధి చెప్పారు..**

ప్రజల తీర్పు ముందు అధికార అహంకారం, కక్షసాధింపు రాజకీయాలు నిలబడలేవని రాష్ట్ర ప్రజలు ఎన్నికల ద్వారా స్పష్టం చేశారని మంత్రి తెలిపారు. చంద్రబాబు నిర్బంధ సమయంలో ప్రతి తెలుగు కుటుంబం, ప్రతి కార్యకర్త, అభిమాని చూపిన పోరాట స్ఫూర్తి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. నేడు ఆయన నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడులు, ఉపాధి కల్పన దిశగా ముందుకు సాగుతోందని అచ్చెన్నాయుడు వివరించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, రాజకీయ కక్షసాధింపులు తాత్కాలికమేనని.. సత్యం, ప్రజాస్వామ్య విలువలు ఎప్పటికీ విజయం సాధిస్తాయని ఆయన స్పష్టం చేశారు.

# ప్రతిష్టాత్మకంగా గోదావరి పుష్కరాలు

**ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి**

**అమరావతి,సెప్టెంబర్ 9:** సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రోడ్ల అభివృద్ధికి రూ. 300 కోట్లకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినట్లు మంత్రి బి.సీ. జనార్ధనరెడ్డి తెలిపారు. ఈ నిధులతో గోదావరి పరిసర ప్రాంతాల్లోని 6 జిల్లాల్లో 78 రోడ్ల మరమ్మతులు, పూర్తిగా దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణకై ఈ నిధులు కేటాయింపు జరిగినట్లు చెప్పారు. తూర్పు ,పశ్చిమ గోదావరి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, పోలవరం, ఏలూరు జిల్లాల్లో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. రూ. 300 కోట్ల నిధులుతో దాదాపు 431 కి.మీ మేర స్టేట్ హైవే జిల్లా ప్రధాన రోడ్ల అభివృద్ధి జరుగుతుందన్నారు. స్టేట్ హైవే లకు సంబంధించి 275 కి.మీ మేర 41 రోడ్ల పనులకు రూ.185.75 కోట్ల నిధులు , జిల్లా ప్రధాన రహదారులు సంబంధించి 155 కి.మీ మేర 37 రహదారులకు రూ. 114.25 కోట్ల నిధులు కేటాయింపు జరిపినట్లు మంత్రి చెప్పారు



రూ. 300 కోట్ల నిధులతో గోదావరి తీరంలో 6 జిల్లాల్లో ఆర్ అండ్ బీ రోడ్ల రూపురేఖలు మారతాయని చెప్పారు. గోదావరి పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనే లక్ష్యంగా భారీగా ఈ నిధుల కేటాయింపు జరిగినట్లు తెలిపారు.

# బడుల్లో సెల్‌ఫోన్లను నిషేధించాలి!

- పద్దెనిమిదేళ్ల లోపు వారికి సోషల్ మీడియా కట్
- పాఠశాలల్లో నైతిక విలువల బోధన తప్పనిసరి
- స్వర్ణభారత్ ట్రస్ట్ రజతోత్సవాల్లో వెంకయ్యనాయుడు



**నెల్లూరు (సమయం న్యూస్):** దేశంలో సాంస్కృతిక, నైతిక విలువలను పరిరక్షించుకోవాల్సిన తక్షణ ఆవశ్యకత ఉందని, అందుకోసం పాఠశాల విద్య నుంచే విద్యార్థులకు 'నైతిక విలువల తరగతులు' తప్పనిసరి చేయాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో ఆ సంస్థ పాతిక సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన మీడియా మిత్రుల ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. గతంలో వాజ్‌పేయి ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన ద్వారా లక్షలాది గ్రామాలకు పక్కా రోడ్లు అనుసంధానం చేయడం తన ప్రజా జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన ఘట్టమని గుర్తుచేసుకున్నారు.

### విమర్శలు విధానాల ఆధారంగానే ఉండాలి..

ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఆయన స్పందిస్తూ, ప్రజాస్వామ్యంలో విధానాల ఆధారంగా విమర్శలు ఉండాలి తప్ప వ్యక్తులపై, కుటుంబాలపై బురదజల్లే వ్యక్తిగత దూషణలు ఉండరాదని స్పష్టం చేశారు. సభలు, చట్టసభల్లో గౌరవప్రదమైన చర్చలు సాగాలని, నిరసనలకు హద్దులు ఉండాలని, అశ్లీల దూషణలు చేసే ధోరణి మారాలని సూచించారు. సమాజంలో విద్వేషాలు, వ్యక్తిగత దూషణలు, హింసను ప్రేరేపించే రీతిలో సోషల్ మీడియా దుర్వినియోగం కావడం పట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా క్రమంగా యాంటీ-సోషల్ మీడియాగా మారుతోందని ఆవేదన చెందారు. ఆస్ట్రేలియా తదితర దేశాల్లో అమలు చేస్తున్న తరహాలోనే, మన దేశంలోనూ పదిహేను నుంచి పద్దెనిమిది ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా ఖాతాలు ఉండకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో పిల్లలకు మొబైల్ ఫోన్లు అనుమతించకూడదని స్పష్టం చేశారు. అవసరమైతే సమాచార మార్పిడి కోసం ప్రధానోపాధ్యాయుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. భోజనం చేసే సమయంలో, కుటుంబ సభ్యులతో గడిపే సమయంలో పిల్లలకు ఫోన్లు అలవాటు చేయడం వారి మానసిక వికాసానికి గొడ్డలిపెట్టు లాంటిదని తల్లిదండ్రులకు హితవు పలికారు.

### రామరాజ్యంలా వికసించాలి..

భారతదేశంలో ఇప్పటికీ యాభై ఎనిమిది శాతం జనాభా గ్రామాల్లోనే నివసిస్తోందని, గ్రామీణ ప్రాంతాల సాధికారత సాధించకుండా దేశం పూర్తి స్థాయిలో పురోగమించలేదని వెంకయ్యనాయుడు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పించిన వికసిత భారత్ లక్ష్యం చేరాలంటే పల్లెలు ఆకలి, అసమానతలు, అన్యాయం లేని రామరాజ్యంలా వికసించాలన్నారు. ఇదే సంకల్పంతో ప్రారంభమైన స్వర్ణభారత్ ట్రస్ట్ రజతోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. రాజకీయాల్లో వారసత్వాన్ని తాను ఎన్నడూ ప్రోత్సహించలేదని, అయితే ప్రజాసేవలో మాత్రం యువత, తన కుటుంబ సభ్యులు సేవా వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# వారి భక్తులకు బీమా ధీమా!

- తిరుమలలో మృతి చెందితే కుటుంబానికి రూ. 2 లక్షలు
- ప్రమాదవశాత్తు చనిపోతే పరిహారం రూ. 10 లక్షలకు పెంపు
- దేశంలోనే తొలిసారిగా టీటీడీ కీలక నిర్ణయం
- 15న బ్రహ్మోత్సవాలు.. పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం



**తిరుమల (సమయం న్యూస్):** తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు సహజ మరణం పొందితే వారి కుటుంబాలకు రూ. 2 లక్షల జీవిత బీమా (లైఫ్ ఇన్సూరెన్స్) అందించాలని టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోనే తొలిసారిగా ఓ ఆలయ పరిపాలనలో ఇలాంటి పథకాన్ని టీటీడీ ప్రవేశపెట్టింది. అలాగే ప్రమాదవశాత్తు మరణించిన భక్తుల కుటుంబాలకు అందించే బీమాను రూ. 3 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచింది. బుధవారం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన అన్నమయ్య భవన్‌లో జరిగిన పాలక మండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు.

### బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు..

సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఛైర్మన్ తెలిపారు. 15న సాయంత్రం మీన లగ్నంలో ధ్వజారోహణం ఉంటుందని, అదే రోజు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని చెప్పారు. రిలయన్స్ సంస్థ విరాళంగా అందించిన 25 ఎలక్ట్రిక్ బస్సులతో పాటు, 2027 సంవత్సరానికి సంబంధించిన టీటీడీ క్యాలెండర్లు, డైరీలను సెప్టెంబర్ 16న ముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు.

### అదనపు సిబ్బంది, బయోగ్యాస్..

బ్రహ్మోత్సవాల్లో దేశంలోని 25 రాష్ట్రాలతో పాటు సింగపూర్, జర్మనీ నుంచి కళాకారులు పాల్గొననున్నారు. భద్రత కోసం 3,000 మంది పోలీసులు, 2,500 మంది టీటీడీ సిబ్బందిని నియమిస్తున్నారు. గరుడసేవ రోజున ఈసారి 9.30 లక్షల మందికి అన్నప్రసాదం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, తిరుమలలోని అన్నప్రసాద కేంద్రం, క్యాంటీన్ల ఆహార వ్యర్థాలతో బయోగ్యాస్ తయారు చేసి తిరిగి అన్నప్రసాద కేంద్రానికే సరఫరా చేసేందుకు ఐవోసీఎల్ సంస్థ ముందుకొచ్చింది. దీని నిర్వహణను రూ. 2.80 కోట్లతో జీపీఎస్ రెన్యూబుల్స్‌కు అప్పగించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. శ్రీవారి పోటులో లడ్డూల తయారీ వేగవంతం చేసేందుకు మరో 400 మంది ఔట్‌సోర్సింగ్ వర్కర్ల నియామకానికి ప్రతిపాదనలు పంపుతున్నారు. ఈ భేటీలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి సహా బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఏపీ వక్ఫ్ బోర్డుకు అరుదైన ఘనత!

- 'తాలీమ్-ఎ-హునర్'కు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- అధికారిక రికార్డ్ హోల్డర్‌గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు
- ఆర్థిక ఇబ్బందులతో ప్రతిభ ఆగకూడదన్న ఛైర్మన్ అబ్దుల్ అజీజ్




**అమరావతి (సమయం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చరిత్రలో మరో అరుదైన ఘనత నమోదైంది. పేద, ప్రతిభావంతులైన ముస్లిం విద్యార్థులకు నాణ్యమైన ఉచిత రెసిడెన్షియల్ విద్యను అందించేందుకు చేపట్టిన ప్రతిష్టాత్మక 'తాలీమ్-ఎ-హునర్' కార్యక్రమానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఈ కార్యక్రమాన్ని గుర్తిస్తూ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ఏపీ వక్ఫ్ బోర్డును అధికారిక రికార్డ్ హోల్డర్‌గా ప్రకటించింది. 'మోస్ట్ మెరిటోరియస్ స్టూడెంట్స్ గాట్ ఫ్రీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్' విభాగంలో ఏపీ వక్ఫ్ బోర్డు పేరును ఆ సంస్థ తమ అధికారిక రికార్డుల్లో నమోదు చేసి, ఇందుకు సంబంధించిన వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో ప్రచురించింది.

### ప్రతి విద్యార్థి సాధించిన విజయం..

ఈ సందర్భంగా ఏపీ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. విద్యా రంగంలో చేపట్టిన తాలీమ్-ఎ-హునర్ కార్యక్రమానికి అంతర్జాతీయ గుర్తింపు రావడం ఎంతో గర్వకారణం అన్నారు. ఆర్థిక పరిస్థితి కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థుల కలలు ఆగిపోకూడదనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పుడు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అధికారిక రికార్డ్ హోల్డర్‌గా స్థానం సంపాదించడం తమ కృషికి లభించిన గొప్ప గుర్తింపు అని హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం కేవలం వక్ఫ్ బోర్డుదే కాదని, తాలీమ్-ఎ-హునర్ ద్వారా కొత్త భవిష్యత్తును నిర్మించుకుంటున్న ప్రతి విద్యార్థిదీ అని ఆయన పేర్కొన్నారు.

### కొత్త కార్యక్రమాలకు శ్రీకారం..

ఈ గుర్తింపు తమపై మరింత బాధ్యతను పెంచిందని ఛైర్మన్ తెలిపారు. విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో మరిన్ని వినూత్న కార్యక్రమాలను చేపట్టి పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా నిలుస్తామని అబ్దుల్ అజీజ్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మంత్రి నారా లోకేశ్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ ప్రోత్సాహం, సహకారంతోనే విద్యా సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అంతర్జాతీయ గుర్తింపు సాధనలో కృషి చేసిన వక్ఫ్ బోర్డు సభ్యులు, అధికారులు, సిబ్బంది, విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# మచిలీపట్నం షిప్‌యార్డ్ చారిత్రాత్మకం!

- రూ. 8,000 కోట్లతో నౌకా నిర్మాణ కేంద్రం
- కోస్ట్ గార్డ్, నావికాదళం నౌకలకు మరమ్మతులు
- వేలాది మందికి ఉపాధి అవకాశాలు



**విశాఖపట్నం (సమయం న్యూస్):** మచిలీపట్నం వద్ద గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ (జీఎస్ఎల్) నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటు ప్రతిపాదన ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధిలో చారిత్రాత్మక ఘట్టమని ఆల్ ఇండియా పోర్ట్ ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ బోర్డు ఏపీ చైర్మన్ షేక్ ఖలీఫాతుల్లా బాషా అన్నారు. విశాఖపట్నంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాజెక్టు వివరాలను వెల్లడించారు. మచిలీపట్నం వద్ద సుమారు రూ. 8,000 కోట్ల భారీ పెట్టుబడితో 400 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. భారత నావికాదళం, కోస్ట్ గార్డ్ అవసరాలకు తగ్గట్టుగా నౌకల నిర్మాణం, మరమ్మతులు, ఆధునీకరణ సదుపాయాలు ఇక్కడ ఏర్పాటు కానున్నాయని చెప్పారు. తొలి దశను 2028 నాటికి, పూర్తి ప్రాజెక్టును 2030 నాటికి అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుతో వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు లాజిస్టిక్స్, సప్లై చైన్, అనుబంధ పరిశ్రమలు కూడా భారీగా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. మచిలీపట్నం షిప్‌యార్డ్ ప్రాజెక్టు రాష్ట్ర తీరప్రాంత పారిశ్రామిక అభివృద్ధికి కీలక మలుపు కానుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఢిల్లీలో గ్లోబల్ డ్రైల్యాండ్ కాంగ్రెస్!

- నేటి నుంచి మూడు రోజుల పాటు కీలక సదస్సు
- ఐసీఏఆర్, ఇక్రిశాట్ ఆధ్వర్యంలో నిర్వహణ
- హాజరుకానున్న 800 మందికి పైగా అంతర్జాతీయ నిపుణులు

**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** పొడి భూముల వ్యవసాయ అభివృద్ధిపై ప్రపంచస్థాయి చర్చలకు న్యూఢిల్లీ వేదికైంది. నేటి (సెప్టెంబర్ 10) నుంచి 12వ తేదీ వరకు రాజధానిలో 'గ్లోబల్ డ్రైల్యాండ్ కాంగ్రెస్‌ఉ2026' సదస్సు జరగనుంది. 'ట్రాన్స్‌ఫార్మింగ్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ విత్ సౌత్‌ఉసౌత్ కోఆపరేషన్' అనే ప్రధాన అంశంతో ఈ కార్యక్రమాన్ని జాతీయ, అంతర్జాతీయ ప్రతిష్టాత్మక సంస్థలు ఐసీఏఆర్, ఇక్రిశాట్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ సదస్సుకు ఆసియా, ఆఫ్రికా, అమెరికా దేశాల నుంచి ఏకంగా 800 మందికి పైగా శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు, రైతు ప్రతినిధులు, అభివృద్ధి భాగస్వాములు హాజరవుతున్నారు. విత్తన అభివృద్ధి, వాతావరణ సహనశీలత, పోషణ-మార్కెట్లు, వ్యవసాయ విధానాలు, విత్తన వ్యవస్థలు, మహిళలు-యువత భాగస్వామ్యం అనే ఆరు ప్రధాన అంశాలపై వీరు మూడు రోజుల పాటు విస్తృతంగా చర్చలు జరపనున్నారు. వాతావరణ మార్పులను తట్టుకుంటూ పొడి భూముల్లో లాభదాయకమైన వ్యవసాయం చేసేందుకు అవసరమైన విధానాలను ఈ వేదికపై విశ్లేషించనున్నారు.

### ముగింపులో కీలక ఒప్పందాలు..

ఈ అంతర్జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో 'ఢిల్లీ డిక్లరేషన్ ఆన్ డ్రైల్యాండ్ (త్రీడీ)'ను అధికారికంగా ఆమోదించనున్నారు. దీనితో పాటు వ్యవసాయ రంగానికి భవిష్యత్తులో మేలు చేసే పలు కొత్త భాగస్వామ్యాలు, కీలక అవగాహన ఒప్పందాలను ప్రకటించే అవకాశం ఉంది. ఈ సదస్సుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అధునాతన వ్యవసాయ పద్ధతులు, అంతర్జాతీయ సహకారంతో రైతుల ఆదాయం పెంచే దిశగా ఈ సదస్సు కీలక నిర్ణయాలు తీసుకోనుంది.

# సీతాఫల్‌మండి స్టేషన్‌లో జీఎం తనిఖీలు!

- భద్రతా అంశాలపై దక్షిణ మధ్య రైల్వే జీఎం సమీక్ష
- సిగ్నలింగ్, క్రాసింగ్‌ల పనితీరు పరిశీలన
- రైల్వే అధికారులకు కీలక సూచనలు



**హైదరాబాద్ (సమయం న్యూస్):** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సికింద్రాబాద్ పరిధిలోని సీతాఫల్‌మండి స్టేషన్ పరిసర ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. రైల్వే కార్యకలాపాలకు సంబంధించిన భద్రతా అంశాలపై ఆయన ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా రైళ్ల రాకపోకలకు అత్యంత కీలకమైన సిగ్నలింగ్ వ్యవస్థలు, ట్రాక్ పాయింట్లు, క్రాసింగ్‌ల పనితీరును జీఎం స్వయంగా పరిశీలించారు. రైల్వే ట్రాక్‌ల నిర్వహణ, సిగ్నల్స్ పనితీరులో లోపాలు లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రత, రైళ్లు సజావుగా గమ్యం చేరే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

# ఝార్ఖండ్ ఓటర్ల జాబితాలో ఆఫ్ఘనీయులు

**జమ్‌షెడ్‌పూర్, సెప్టెంబర్ 09:** ఝార్ఖండ్‌లో నిర్వహించిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో తీవ్ర దిగ్భ్రాంతికర విషయం వెలుగులోకి వచ్చింది. జమ్‌షెడ్‌పూర్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఓటర్ల ముసాయిదా జాబితాలో ఏకంగా ముగ్గురు ఆఫ్ఘనిస్థాన్ పౌరుల పేర్లు నమోదైనట్లు అధికారులు గుర్తించారు. ముసాయిదా ఓటర్ల జాబితా పరిశీలన, పత్రాల ధృవీకరణ సమయంలో అధికారులు ఈ వ్యత్యాసాన్ని కనిపెట్టారు. నోటీసులు జారీ చేసినప్పటికీ, వారు సరైన భారతీయ పౌరసత్వ పత్రాలను సమర్పించలేకపోయారు. అనంతరం నిర్వహించిన తనిఖీల్లో వారి వద్ద ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్టులు లభించడంతో వారు విదేశీయులని నిర్ధారణ అయింది.

## సంపాదకీయం



# వరుస వివాదాలు

## బీఆర్ఎస్‌కు బలమా? బలహీనతా?

**అరెస్టులు.. సస్పెన్షన్లతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త వేడి**

**'ప్రభుత్వ నిర్బంధం'గా మలిస్తే గులాబీ పార్టీకి సానుభూతి**

**హద్దు దాటిన వ్యాఖ్యల ముద్ర పడితే రాజకీయంగా ఎదురుదెబ్బ**

తెలంగాణ రాజకీయాల్లో కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలను గమనిస్తే ఒక విషయం స్పష్టంగా కనిపిస్తోంది. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు సభలో వాదోపవాదాల స్థాయిని దాటి అసెంబ్లీ గేట్లు, పోలీస్‌స్టేషన్లు, కోర్టులు, సస్పెన్షన్ల వరకు చేరింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, ఎన్.నవీన్‌కుమార్‌రెడ్డిల సస్పెన్షన్, అరెస్టులు, స్పీకర్‌పై వ్యాఖ్యల వివాదం, మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల ప్రవర్తనకు సంబంధించిన ఆరోపణలు.. అన్నీ కలిపి తెలంగాణ రాజకీయాలను వేడెక్కించాయి. అయితే ఈ పరిణామాలన్నీ బీఆర్ఎస్‌కు రాజకీయంగా లాభమా? నష్టమా? అనే ప్రశ్న ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. దీనికి ఒకే మాటలో సమాధానం చెప్పడం కష్టం. ఎందుకంటే ఇదే ఘటనలు ఒక కోణంలో బీఆర్ఎస్‌కు సానుభూతిని తెచ్చిపెట్టే అవకాశముంటే.. మరో కోణంలో పార్టీపై ప్రతికూల అభిప్రాయాన్ని కూడా పెంచే ప్రమాదం ఉంది. ప్రతిపక్ష రాజకీయాల్లో అరెస్టులు, నిర్బంధాలు కొత్తేమీ కాదు. అధికారంలో ఉన్న పార్టీ తమ గొంతు నొక్కుతోందని ప్రజలను నమ్మించగలిగితే అవే పరిణామాలు ప్రతిపక్షానికి రాజకీయ పెట్టుబడిగా మారిన సందర్భాలు దేశ రాజకీయాల్లో ఉన్నాయి. ప్రస్తుతం బీఆర్ఎస్ కూడా అదే వాదనను ముందుకు తెస్తోంది. తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే పోలీసులను ఉపయోగించి అణచివేస్తున్నారని ఆరోపిస్తోంది. ఎమ్మెల్సీల అరెస్టులు, అనంతరం కోర్టు రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించడం వంటి పరిణామాలను తన వాదనకు అనుకూలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆ పార్టీ ప్రయత్నించే అవకాశం ఉంది. ముఖ్యంగా అసెంబ్లీ గేటు వద్ద మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో పోలీసులు దురుసుగా వ్యవహరించారన్న బీఆర్ఎస్ ఆరోపణలు ప్రజల్లోకి బలంగా వెళ్తే ప్రభుత్వమే రాజకీయంగా సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి రావచ్చు. ఈ ఆరోపణలను ప్రభుత్వం ఖండించినా.. అసలు ఏం జరిగిందన్నది పారదర్శక విచారణతో తేల్చడం అవసరం.

**కానీ.. 'హద్దు దాటారు' అనే ముద్ర పడితే?**

బీఆర్ఎస్‌కు అసలు ప్రమాదం ఇక్కడే ఉంది. ప్రతిపక్షం ఎంత దూకుడుగా పోరాడినా ప్రజాస్వామ్య వ్యవస్థల్లో కొన్ని హద్దులు ఉంటాయి. సభాధ్యక్షుడిని, ఆయన కుటుంబ సభ్యులను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారనే అభిప్రాయం ప్రజల్లో బలపడితే బీఆర్ఎస్‌కు సానుభూతి కంటే వ్యతిరేకతే ఎక్కువయ్యే ప్రమాదం ఉంటుంది. తాతా మధు తన వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించినవి కావని వివరణ ఇచ్చారు. ఒకవేళ తన వ్యాఖ్యలను స్పీకర్ అలా భావిస్తే వెనక్కి తీసుకుంటానని కూడా పేర్కొన్నారు. అయినప్పటికీ వివాదం అక్కడితో ముగియలేదు. ఇద్దరు ఎమ్మెల్సీల సస్పెన్షన్ వరకు వెళ్లింది. ఇలాంటి సమయంలో బీఆర్ఎస్ తన రాజకీయ పోరాటానికి, వ్యక్తిగత వ్యాఖ్యలకు మధ్య స్పష్టమైన గీత గీయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాన్ని ఎంత తీవ్రంగా విమర్శించినా వ్యక్తిగత దూషణలుగా భావించే మాటలు మొత్తం రాజకీయ అంశాన్నే పక్కదారి పట్టిస్తాయి. అప్పుడు ప్రజలు చర్చించాల్సిన ప్రభుత్వ వైఫల్యాల స్థానంలో 'ఎవరు ఎవరిని ఏమన్నారు?' అన్నదే ప్రధాన చర్చగా మారుతుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలన్న అధికారపక్ష డిమాండ్ కూడా రాజకీయంగా ఆసక్తికరమైనదే. ఇద్దరు ఎమ్మెల్సీల వ్యాఖ్యల బాధ్యతను నేరుగా పార్టీ అధినేతకు ముడిపెట్టడం ద్వారా వివాదాన్ని కేసీఆర్ వరకు తీసుకెళ్లే ప్రయత్నం కనిపిస్తోంది. కాంగ్రెస్‌కు ఇందులో రాజకీయ ప్రయోజనం లేకపోలేదు. బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలను పార్టీ సంస్కృతిగా చిత్రీకరించగలిగితే ప్రతిపక్షంపై నైతిక ఒత్తిడి పెంచవచ్చు. మరోవైపు బీఆర్ఎస్ మాత్రం వ్యక్తుల వ్యాఖ్యల పేరుతో పార్టీ అధినేతను లక్ష్యంగా చేసుకోవడం రాజకీయ కక్షసాధింపేనని ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చు. ఇద్దరు ఎమ్మెల్సీల సభ్యత్వాలనే రద్దు చేయాలన్న డిమాండ్లు అధికారపక్షం నుంచి మరింత తీవ్రమైతే రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉంది. సభా గౌరవాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు అవసరమన్న వాదన ఒకవైపు ఉంటుంది. అదే సమయంలో శిక్ష తప్పుకు తగిన స్థాయిలోనే ఉండాలన్న ప్రజాస్వామ్య సూత్రం కూడా ముఖ్యమే.

**కాంగ్రెస్‌కూ సంయమనమే శ్రేయస్కరం**

ఈ వ్యవహారంలో బీఆర్ఎస్ మాత్రమే ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం లేదు. అధికారపక్షానికీ అంతే బాధ్యత ఉంది. ప్రతిపక్ష నేతలు హద్దులు దాటితే చట్టం, సభా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. కానీ ప్రతి రాజకీయ నిరసనకూ పోలీసు చర్యే సమాధానమన్న అభిప్రాయం ఏర్పడితే అది ప్రభుత్వానికే నష్టం చేస్తుంది. ప్రతిపక్షానికి నిరసన తెలిపే ప్రజాస్వామ్య అవకాశం ఉండాలి. అదే సమయంలో సభా గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతిపక్షానికీ ఉంటుంది. ఈ రెండు సూత్రాల్లో ఏ ఒక్కటి దెబ్బతిన్నా ప్రజాస్వామ్యమే బలహీనపడుతుంది.

**మరి.. బీఆర్ఎస్‌కు పాజిటివా? నెగెటివా?**

ప్రస్తుతానికి చూస్తే బీఆర్ఎస్‌కు ఇది 'పూర్తి పాజిటివ్' కాదు.. 'పూర్తి నెగెటివ్' కూడా కాదు. ఈ పరిణామాలను ఆ పార్టీ ఇకపై ఎలా మలుచుకుంటుందన్నదే ఫలితాన్ని నిర్ణయిస్తుంది. అరెస్టులు, సస్పెన్షన్లను మాత్రమే చూపిస్తూ సానుభూతి కోరితే దాని ప్రభావం పరిమితమే కావచ్చు. మహిళా ఎమ్మెల్యేల ఘటనపై వాస్తవాలను ఆధారాలతో ప్రజల ముందుంచి, అదే సమయంలో వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉంటూ ప్రభుత్వ హామీలు, రైతులు, నిరుద్యోగులు, మహిళలు, సంక్షేమం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వంటి ప్రజా సమస్యలపై పోరాటాన్ని నిర్మిస్తే ఈ పరిణామాలు బీఆర్ఎస్‌కు రాజకీయంగా ఉపయోగపడే అవకాశం ఉంది. అదే దూకుడు పేరుతో వ్యక్తిగత వ్యాఖ్యలు, సభా మర్యాదలను దాటే ప్రవర్తన కొనసాగితే అధికారపక్షం కోరుకుంటున్నట్లుగానే అసలు సమస్యల నుంచి చర్చ పక్కదారి పడుతుంది. అప్పుడు లాభం కంటే నష్టమే ఎక్కువ కావచ్చు. పోరాటం ఎంత దూకుడుగా సాగిందన్నది కాదు.. దేనికోసం సాగిందన్నదే ప్రజలు చివరకు గుర్తుంచుకుంటారు. అధికారానికి సంయమనం ఎంత అవసరమో.. ప్రతిపక్షానికి బాధ్యత అంతే అవసరం. ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు బీఆర్ఎస్‌కు అవకాశాన్నీ ఇచ్చాయి.. హెచ్చరికనూ చేశాయి. ఆ అవకాశాన్ని ప్రజా ఎజెండాగా మార్చుకుంటుందా? వివాదాల ఊబిలోనే చిక్కుకుంటుందా? అన్నదే గులాబీ పార్టీ ముందున్న అసలు పరీక్ష.

# రైల్వే విస్తరణకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- ఏడు రద్దీ కారిడార్లలో నాలుగు లైన్లు
- 11 వేల కోట్లతో మల్టీట్రాకింగ్ పనులు
- ఐదు రాష్ట్రాల్లోని 14 జిల్లాలకు ప్రయోజనం
- ఏటా 27 మిలియన్ టన్నుల సరకు సామర్థ్యం పెంపు
- తెలుగు రాష్ట్రాలకూ భారీగా లబ్ధి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** దేశంలో రైల్వే మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అత్యంత రద్దీగా ఉండే ఏడు ప్రధాన రైల్వే కారిడార్లలో నాలుగు లైన్ల వ్యవస్థను విస్తరించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. సుమారు రూ.11 వేల కోట్ల విలువైన మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కేంద్రం నిర్ణయంతో ఢిల్లీ-హౌరా, హౌరా-ముంబై, ఢిల్లీ-ముంబై, ఢిల్లీ-గువాహటి, ఢిల్లీ-చెన్నై, హౌరా-చెన్నై, ముంబై-చెన్నై కారిడార్లలో రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచనున్నారు. అత్యంత రద్దీగా ఉండే ఈ మార్గాల్లో అదనపు లైన్లు అందుబాటులోకి రావడంతో రైళ్ల రాకపోకల్లో ఆటంకాలు తగ్గడంతో పాటు మరిన్ని ప్రయాణికుల, సరకు రైళ్లను నడిపేందుకు



అవకాశం ఏర్పడనుంది.

**4,790 గ్రామాలకు ప్రయోజనం**

ఈ ప్రాజెక్టులతో ఐదు రాష్ట్రాల్లోని 14 జిల్లాలకు ప్రయోజనం చేకూరనుంది. దాదాపు 4,790 గ్రామాల్లో రైలు కనెక్టివిటీ, రవాణా సామర్థ్యం మెరుగుపడనుండగా సుమారు 56 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనం కలుగుతుందని అంచనా. ఢిల్లీ-హౌరా మార్గంలో కాన్పూర్, ప్రయాగ్‌రాజ్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్, పాట్నా, ఆసన్‌సోల్ వంటి కీలక ప్రాంతాలు ఉన్నాయి. ఢిల్లీ-ముంబై మార్గం మథుర, కోటా, రత్లాం, వడోదర, సూరత్‌లను కలుపుతుంది. ఢిల్లీ-చెన్నై మార్గంలో ఆగ్రా, గ్వాలియర్, ఝాన్సీ, భోపాల్, నాగ్‌పూర్, విజయవాడ వంటి ప్రధాన నగరాలు ఉన్నాయి. ముంబై-చెన్నై కారిడార్ పుణె సహా పలు కీలక ప్రాంతాలను అనుసంధానిస్తోంది.

**సరకు రవాణాకు మరింత ఊపు**

ఈ కారిడార్లు బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు తదితర కీలక సరకు రవాణాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. మల్టీట్రాకింగ్ పనులు పూర్తయితే ఏటా అదనంగా సుమారు 27 మిలియన్ టన్నుల సరకు రవాణా సామర్థ్యం పెరుగుతుందని అంచనా. రద్దీ తగ్గడంతో ప్రయాణికుల రైళ్ల వేగం, సమయపాలన మెరుగుపడేందుకు కూడా అవకాశం ఏర్పడనుంది. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రైల్వేల ఆధునికీకరణ, మౌలిక వసతుల విస్తరణకు నిరంతరం ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. రద్దీ అధికంగా ఉన్న ప్రధాన కారిడార్ల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు భవిష్యత్ రవాణా అవసరాలకు అనుగుణంగా మరిన్ని మార్గాల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.

**తెలుగు రాష్ట్రాలకు లబ్ధి**

కేంద్ర నిర్ణయంతో తెలుగు రాష్ట్రాల్లోనూ రైల్వే మౌలిక వసతుల విస్తరణకు మార్గం సుగమం కానుంది. హౌరా-చెన్నై కారిడార్‌లో భాగంగా విశాఖపట్నం, విజయవాడ మీదుగా నాలుగు లైన్ల విస్తరణ జరగనుంది. ముంబై-చెన్నై కారిడార్‌లో గుంతకల్లు, రేణిగుంట మీదుగా నాలుగు లైన్ల సామర్థ్యం అందుబాటులోకి రానుంది. తెలంగాణలో ఘట్‌కేసర్-కాజీపేట మధ్య సుమారు 110 కిలోమీటర్ల మేర రూ.2,418 కోట్లతో నాలుగో లైన్ నిర్మించనున్నారు. మరోవైపు అరక్కోణం-రేణిగుంట సెక్షన్‌లో మూడు, నాలుగో లైన్ల నిర్మాణానికి కూడా ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. కొత్త లైన్ల నిర్మాణంతో రద్దీ తగ్గడం, రైళ్ల సంఖ్య పెరగడం, సరకు రవాణా సామర్థ్యం మెరుగుపడటంతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని కీలక రైల్వే మార్గాలకు మరింత ఊపు లభించనుంది.

# ఉగ్ర కేసు ఎత్తివేయలేదు.. దర్యాప్తు కొనసాగుతోంది

**ఏడుగురు విదేశీయులపై ఎన్ఐఏ స్పష్టత**

## యూఏపీఏ కోణంలో విచారణ

**ప్రస్తుత ఛార్జ్‌షీట్‌లో విదేశీయుల చట్టం సెక్షన్లే**

**ఆధారాలు లభిస్తే అనుబంధ ఛార్జ్‌షీట్**

**ఉగ్ర ఆరోపణలు తొలగించారన్న ప్రచారానికి తెర**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** అమెరికా దేశస్థుడు మాథ్యూ ఆరోన్ వాన్‌డైక్ సహా ఏడుగురు విదేశీయులపై ఉగ్రవాద ఆరోపణలను పూర్తిగా ఉపసంహరించుకోలేదని జాతీయ దర్యాప్తు సంస్థ వర్గాలు స్పష్టం చేశాయి. చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద నమోదైన అంశాలపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని పేర్కొన్నాయి. ప్రస్తుత ఛార్జ్‌షీట్‌లో ఆ చట్టంలోని సెక్షన్లు లేకపోవడాన్ని ఉగ్రవాద కోణంలో దర్యాప్తు ముగిసినట్లుగా భావించరాదని తెలిపాయి. భారత్‌లోని సాయుధ గ్రూపులతో సంబంధాలు, ఉగ్ర కుట్రకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో వాన్‌డైక్‌తో పాటు మరో ఆరుగురు విదేశీయులను ఎన్ఐఏ అరెస్టు చేసింది. దర్యాప్తులో ఇప్పటివరకు దేశంలోకి అక్రమంగా ప్రవేశించడం, అనుమతులు లేకుండా నివసించడం, సంచరించడం వంటి నేరాలకు సంబంధించిన ఆధారాలు లభించినట్లు దర్యాప్తు సంస్థ వర్గాలు తెలిపాయి. ఈ కేసులో ఏడుగురు నిందితులపై ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారెనర్స్ చట్టంలోని సెక్షన్లు 21, 23 కింద ఎన్ఐఏ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అయితే అందులో యూఏపీఏ సెక్షన్లను ప్రస్తావించకపోవడంతో నిందితులపై ఉగ్రవాద ఆరోపణలను ఎన్ఐఏ ఎత్తివేసిందన్న ప్రచారం జరిగింది. దీనిపై ఎన్ఐఏ వర్గాలు స్పందిస్తూ.. ఇప్పటివరకు దర్యాప్తులో స్పష్టమైన ఆధారాలు లభించిన నేరాలకు సంబంధించి మాత్రమే ప్రస్తుత ఛార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు తెలిపాయి. ఉగ్రవాద సంబంధాలు, కుట్ర ఆరోపణలపై విచారణ మాత్రం కొనసాగుతోందని స్పష్టం చేశాయి. యూఏపీఏ కింద నేరాన్ని నిర్ధారించే ఆధారాలు తదుపరి దర్యాప్తులో వెలుగులోకి వస్తే అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలు చేసే అవకాశం ఉందని ఎన్ఐఏ వర్గాలు పేర్కొన్నాయి. అందులో సంబంధిత యూఏపీఏ సెక్షన్లను చేర్చే అవకాశం ఉంటుందని తెలిపాయి. ప్రస్తుత ఛార్జ్‌షీట్‌లో యూఏపీఏ సెక్షన్లు లేకపోవడం వల్ల ఉగ్రవాద ఆరోపణలు పూర్తిగా తొలగిపోయినట్లు కాదని, ఆ కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని ఎన్ఐఏ వర్గాలు స్పష్టం చేశాయి.

# మా ఆదేశాలనే ధిక్కరిస్తారా.. అంత ధైర్యం ఎలా వచ్చింది?

**విద్యార్థికి నోటీసుపై సుప్రీంకోర్టు ఆగ్రహం**

**చర్యలు వద్దని చెప్పినా ఎలా ఇచ్చారని ప్రశ్న**

**మేజిస్ట్రేట్ తీరుపై ధర్మాసనం మండిపాటు**

**జిల్లా అధికారుల నుంచి వివరణ కోరనున్న కోర్టు**

**నోటీసును వెనక్కి తీసుకున్నట్లు వెల్లడి**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** "విద్యార్థులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని మా ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. అయినా ఓ విద్యార్థికి నోటీసు జారీ చేసేంత ధైర్యం మేజిస్ట్రేట్‌కు ఎలా వచ్చింది?" అంటూ సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జులైలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనల్లో పాల్గొన్నారన్న ఆరోపణలతో గ్రేటర్ నోయిడాకు చెందిన ఓ విద్యార్థికి ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసు జారీ చేయడాన్ని తప్పుబట్టింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ వ్యవహారంపై స్పందిస్తూ.. తమ స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ విద్యార్థిపై చర్యలకు ఎలా ఉపక్రమించారని ప్రశ్నించింది. గౌతమ్‌బుద్ధ నగర్ జిల్లా మేజిస్ట్రేట్, సంబంధిత ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నుంచి వివరణ కోరనున్నట్లు తెలిపింది. జులైలో జరిగిన సీజేపీ ఆందోళనలకు సంబంధించి విద్యార్థులపై నమోదైన కేసులన్నింటినీ కొట్టివేయాలని సుప్రీంకోర్టు ఈ నెల 1న ఆదేశించినట్లు సమాచారం. జులై 20 నుంచి 25 మధ్య దేశవ్యాప్తంగా విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొనసాగించరాదని, వాటిని ముగిసిన కేసులుగా పరిగణించాలని స్పష్టం చేసింది. అదే ఆందోళనలకు సంబంధించి భవిష్యత్తులోనూ విద్యార్థులపై కొత్తగా బలవంతపు చర్యలు తీసుకోవద్దని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే గ్రేటర్ నోయిడాకు చెందిన విద్యార్థికి మేజిస్ట్రేట్ నోటీసు జారీ చేసిన విషయాన్ని సీనియర్ న్యాయవాది బిశ్వజిత్ భట్టాచార్య సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ధర్మాసనం జోక్యం చేసుకోవాలని కోరారు. దీనిపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. "ఓ విద్యార్థికి మేజిస్ట్రేట్ నోటీసు ఎలా జారీ చేస్తారు? విద్యార్థులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని మా ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. అయినా ఇలా చేయడానికి మేజిస్ట్రేట్‌కు ఎంత ధైర్యం?" అంటూ ప్రశ్నించింది. గౌతమ్‌బుద్ధ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థికి ఈ నెల 4న నోటీసు జారీ చేసినట్లు కోర్టు దృష్టికి వచ్చింది. ప్రభుత్వ వ్యతిరేక సమాచారాన్ని ప్రచారం చేయడంతో పాటు జంతర్‌మంతర్ వద్ద జరిగిన సీజేపీ ఆందోళనలో పాల్గొనేలా ఇతర విద్యార్థులను ప్రోత్సహించారన్న ఆరోపణలను అందులో పేర్కొన్నట్లు సమాచారం. అయితే నోటీసు జారీ చేసిన మరుసటి రోజే దానిని ఉపసంహరించుకున్నట్లు కోర్టుకు తెలియజేశారు. అయినప్పటికీ తమ ఆదేశాలకు విరుద్ధంగా అసలు నోటీసు ఎందుకు జారీ చేయాల్సి వచ్చిందనే అంశంపై సంబంధిత అధికారుల నుంచి వివరణ కోరాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది.



# భారతరత్నకు 'సర్' కష్టాలు

## ఒక్క అక్షరం తేడాతో చిక్కులు!

**పాత, కొత్త ఓటరు జాబితాల్లో పేరు సరిపోలలేదని సమాచారం**

**ఈసీ నోటీసులు పంపినట్లు ప్రచారం**

**తమకు నోటీసులేవీ అందలేదన్న రావు ప్రతినిధి**

**గతంలో పద్మశ్రీ హరేకల హాజబ్బకూ ఇదే సమస్య**

**బెంగళూరు, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** బెంగళూరుకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న గ్రహీత ప్రొఫెసర్ సీఎన్ఆర్ రావుకు 'సర్' ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం(ఈసీ) నోటీసులు పంపించిందని సమాచారం. పాత ఓటరు లిస్టులో ఆయన పేరు.. ఒక అక్షరం కారణంగా ప్రస్తుతం రికార్డుల్లో ఉన్న పేరుతో మిస్‌మ్యాచ్ అయిందని వార్తలు వస్తున్నాయి. పాత రికార్డుల్లో ఫ్రాతీశీట జచీ= ఝశీ' అని ఉంటే, కొత్త రికార్డుల్లో ఫ్రాతీశీటట జచీ= ఝశీ' అని ఉంది. ఇందులో ఒక్క 'ఎఫ్' అక్షరం అదనంగా ఉండటం వల్ల ఈసీ నోటీసులు పంపించిందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే ప్రొఫెసర్ సీఎన్ఆర్ ప్రతినిధి మాత్రం తమకు ఇప్పటిదాకా ఎలాంటి నోటీసులు అందలేదని మీడియాకు తెలిపారు. అలాగే ఒక్క అక్షరం అదనంగా ఉందని.. అది తప్ప మరే ఇతర సమస్యా లేదని ఆయన వివరించారు. ఒక్క సీఎన్ఆర్‌కే కాకుండా చాలా మంది ప్రముఖులకు సర్ నోటీసులు అందుతున్నాయి. మంగళూరుకు చెందిన పద్మశ్రీ గ్రహీత హరేకల హాజబ్బకు పేరులో వ్యత్యాసం కారణంగా 'సర్' నోటీసులు అందాయి. కర్ణాటక చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించారు. కాగా, కర్ణాటకలో జన్మించిన ప్రొఫెసర్ సీఎన్ఆర్ రావు స్ట్రక్చరల్ కెమిస్ట్రీలో విశేష కృషి చేసి 2014లో భారత అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న పొందారు. అలాగే ఆయన పద్మశ్రీ, పద్మవిభూషణ్, కర్ణాటక రత్న పురస్కారాలూ అందుకున్నారు.

# అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు

- ఇరాన్ చమురు ట్యాంకర్లపై దాడులు
- దాడులకు ప్రతిదాడులు చేసిన ఇరాన్
- అమెరికా అండర్ వాటర్ డ్రోన్ సీజ్



**ఒమన్ గల్ఫ్, సెప్టెంబర్ 09:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇరాన్‌కు చెందిన ఐదు ముడి చమురు రవాణా నౌకలపై అమెరికా బలగాలు దాడులు నిర్వహించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంటకామ్) వెల్లడించింది. మంగళవారం చేపట్టిన ఈ దాడుల్లో నాలుగు నౌకలు పూర్తిగా ధ్వంసమైనట్లు, మరో నౌక దెబ్బతిన్నట్లు తెలిపింది. అమెరికా యుద్ధనౌకపై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) 48 గంటల్లో రెండుసార్లు బాలిస్టిక్ క్షిపణులతో దాడికి ప్రయత్నించడంతో ప్రతీకార చర్యగా ఈ దాడులు చేపట్టినట్లు సెంట్కామ్ పేర్కొంది. సెంటకామ్ ప్రకటన ప్రకారం, ఒమన్ గల్ఫ్‌లో ఇరాన్‌కు చెందిన నాలుగు ముడి చమురు రవాణా నౌకలు దాడుల్లో ధ్వంసమయ్యాయి. డెర్యా ఖార్గ్ ద్వీపం సమీపంలో దెబ్బతిన్నట్లు అమెరికా సైనిక కమాండ్ తెలిపింది. దాడికి సంబంధించిన దృశ్యాలను కూడా విడుదల చేసింది. ఈ దాడులకు ముందు ఐదు నౌకల్లోని సిబ్బందిని ఖాళీ చేయాలని అమెరికా బలగాలు ప్రత్యక్ష ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించింది. మానవ ప్రాణనష్టాన్ని నివారించేందుకు ముందస్తు హెచ్చరికలు ఇచ్చినట్లు పేర్కొంది. ఇరాన్ ప్రభుత్వ అనుబంధ నౌకాదళానికి చెందిన ఈ నౌకలు, టెహ్రాన్ భద్రతా వ్యవస్థకు ఆర్థికంగా కీలకమైనవని అమెరికా పేర్కొంది. గత 48 గంటల్లో ఇరాన్? ఒక అమెరికా నావికాదళ యుద్ధనౌకను రెండుసార్లు బాలిస్టిక్ క్షిపణులతో లక్ష్యంగా చేసుకునేందుకు ప్రయత్నించిందని యుఎస్? సెంట్రల్? కమాండ్ తెలిపింది. అయితే ఆ రెండు దాడులను అమెరికా యుద్ధనౌక విజయవంతంగా తప్పించుకున్నట్లు వెల్లడించింది. ఈ ఘటనలో అమెరికా సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని, యుద్ధనౌక కార్యకలాపాలకు కూడా ఎలాంటి నష్టం జరగలేదని వెల్లడించింది. దాడి ప్రయత్నాల తర్వాత కూడా ఆ యుద్ధనౌక ప్రాంతీయ జలాల్లో గస్తీ కొనసాగిస్తోందని పేర్కొంది. సెప్టెంబర్ 5న కూడా ఐఆర్?జీసీ అమెరికా విమాన వాహక నౌక, గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్‌పై దాడికి ప్రయత్నించిందని సెంట్కామ్ తెలిపింది. ఆ దాడి ప్రయత్నం విఫలమైన తర్వాత మూడు ఇరాన్ ముడి చమురు రవాణా నౌకలను అమెరికా బలగాలు ధ్వంసం చేశాయని పేర్కొంది. తాజాగా మరో ఐదు నౌకలపై చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది. దాడులకు గురైన నౌకలు సాధారణ వాణిజ్య రవాణా వ్యవస్థలో భాగం కాదని అమెరికా సైనిక కమాండ్ ఆరోపించింది. ఇవి ఐఆర్జీసీ, దాని ప్రాంతీయ మిత్ర బలగాలకు నిధులు సమకూర్చే బహుళ బిలియన్ డాలర్ల రహస్య నెట్‌వర్క్‌లో భాగమని పేర్కొంది. ఇరాన్ తన భద్రతా వ్యవస్థను కొనసాగించేందుకు చమురు ఆదాయంపై ఆధారపడుతోందని అమెరికా చెబుతోంది. ఈ నేపథ్యంలో చమురు రవాణా వ్యవస్థను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడి పెంచే ప్రయత్నంగా తాజా దాడులను పరిశీలిస్తున్నారు. మరోవైపు అమెరికా దాడులకు ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ చమురు ట్యాంకర్లపై అమెరికా దాడులకు ప్రతీకారంగా ఐఆర్?జీసీ సైనిక చర్యలు చేపట్టినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. జోర్డాన్‌లోని అమెరికా ఆధీనంలోని అల్ అజ్రాక్ వైమానిక స్థావరంపై బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసినట్లు ఐఆర్జీసీ ప్రకటించింది. అమెరికా నావికాదళానికి చెందిన రెండు డిస్ట్రాయర్లను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్ పేర్కొంది. ఈ దాడుల్లో ద్రవ, ఘన ఇంధన బాలిస్టిక్ క్షిపణులను ఉపయోగించారని ఆఆర్?జిసి ధ్రువీకరించింది. అమెరికా యుద్ధ విమానాలకు సంబంధించిన హ్యాంగర్లు, రక్షణ షెల్టర్లను లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రకటించింది. అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ మరో కీలక హెచ్చరిక చేసింది. కువైట్, బహ్రెయిన్ ఓడరేవుల సమీపంలోని చమురు ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. పోర్టుల్లో నౌకలు లంగరు వేసి ఉన్నప్పటికీ వాటిపై దాడులు జరిగే అవకాశం ఉందని తెలిపింది. నౌకల్లో పనిచేస్తున్న సిబ్బంది వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించింది. అమెరికా బలగాలకు కువైట్, బహ్రెయిన్‌లు ఆశ్రయం కల్పిస్తున్నాయని, తమపై జరిగే దాడులకు సహకరిస్తున్నాయని ఇరాన్ ఆరోపించింది. ఈ హెచ్చరికలతో గల్ఫ్ ప్రాంతంలో వాణిజ్య నౌకల భద్రతపై ఆందోళనలు మరింత పెరిగాయి. ముఖ్యంగా చమురు రవాణాకు కీలకమైన సముద్ర మార్గాల్లో ఉద్రిక్తతలు పెరిగితే అంతర్జాతీయ ఇంధన సరఫరాపైనా ప్రభావం పడే అవకాశం ఉందనే చర్చ మొదలైంది. ఇదిలా ఉండగా, హర్మూజ్ జలసంధిలో అమెరికాకు చెందిన అండర్‌వాటర్ డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఇరాన్ తెలిపింది. ఈ పరిణామం కూడా ఇరు దేశాల మధ్య సముద్ర ఉద్రిక్తతలను మరింత పెంచింది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన ప్రాంతంగా ఉన్న హర్మూజ్ జలసంధిలో అమెరికా, ఇరాన్ బలగాల మధ్య ఎదురుపడే పరిస్థితులు ఏర్పడటంతో అంతర్జాతీయంగా ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికా ఇరాన్ నౌకా రవాణాపై దాడులు కొనసాగిస్తే, తమ సైనిక చర్యలు కూడా ఆగవని ఐఆర్?జీసీ స్పష్టం చేసింది. ప్రాంతీయ జలాల్లో ఇకపై ఎలాంటి చర్యలకు పాల్పడవద్దని వాషింగ్టన్‌ను హెచ్చరించింది. ఇరాన్ క్షిపణులు ప్రాంతీయ గగనతలాన్ని దాటడంతో పొరుగు దేశాల్లోని వాయు రక్షణ వ్యవస్థలు అప్రమత్తమైనట్లు నివేదికలు పేర్కొన్నాయి. దీంతో ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న మధ్యప్రాచ్యంలో పరిస్థితులు మరింత ఆందోళనకరంగా మారాయి.

# ‘కాగ్నిజెంట్’కు భారీ ఎదురుదెబ్బ

- శాశ్వత లేబర్ సర్టిఫికేషన్ నిలిపివేత
- అమెరికా ఉద్యోగుల భద్రతకై నిర్ణయం
- రెండు సంస్థలపై దర్యాప్తు ముమ్మరం




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 09:** మోసాలపై ట్రంప్ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతున్న వేళ ప్రముఖ ఐటీ సంస్థ ‘కాగ్నిజెంట్’కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. గ్రీన్ కార్డు పొందడానికి తొలి మెట్టుగా భావించే శాశ్వత లేబర్ సర్టిఫికేషన్ (పీఈఆర్ఎం) ఫైలింగ్స్‌ను అమెరికా ప్రభుత్వం నిలిపివేసింది. కాగ్నిజెంట్‌తో పాటు, క్లౌడెరా సంస్థల శాశ్వత లేబర్ సర్టిఫికేషన్ ప్రక్రియను సస్పెండ్ చేసినట్లు అమెరికా కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆంథోనీ డి’ఎస్పోసిటో ప్రకటించారు. అమెరికా ఉద్యోగులకు ముప్పు వాటిల్లితే సహించేది లేదని పేర్కొన్నారు. వైట్‌హౌస్ ఫ్రాడ్ టాస్క్ ఫోర్స్, ఇతర ఉన్నతాధికారుల సమన్వయంతోనే ఈ రెండు సంస్థలపై దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. మరోవైపు ఈ వ్యవహారంపై అమెరికా కార్మిక శాఖ దర్యాప్తును వేగవంతం చేసింది. వైట్‌హౌస్ ఫ్రాడ్ టాస్క్‌ఫోర్స్‌తో కలిసి వాస్తవాలు, మోసం, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అంశాలను లోతుగా పరిశీలిస్తున్నామని ఆంథోనీ డి’ఎస్పోసిటో తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. “కాగ్నిజెంట్ పెర్మ్ ఫైలింగ్‌లను నిలిపివేశాం. వైట్‌హౌస్ ఫ్రాడ్ టాస్క్‌ఫోర్స్‌తో కలిసి వాస్తవాలు, మోసం, ఆర్థిక లావాదేవీలను పరిశీలిస్తున్నాం. నేరస్థులకు సంకెళ్లు సిద్ధంగా ఉన్నాయ” అని డి’ఎస్పోసిటో పేర్కొన్నారు. కాగ్నిజెంట్, క్లౌడెరా సంస్థల పెర్మ్ ప్రక్రియను ఎందుకు నిలిపివేశారనే దానిపై దర్యాప్తు పూర్తయ్యే వరకు మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం కార్మిక శాఖ అధికారులు సంబంధిత రికార్డులు, ఫైలింగ్స్, ఆర్థిక లావాదేవీలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికాలో పనిచేస్తున్న విదేశీ ఉద్యోగులకు శాశ్వత నివాసం అంటే గ్రీన్‌కార్డు కోసం యాజమాన్యాలు అనుసరించే ముఖ్యమైన ప్రక్రియే ప్రోగ్రామ్ ఎలక్ట్రానిక్ రివ్యూ మేనేజ్‌మెంట్. విదేశీ ఉద్యోగిని శాశ్వతంగా నియమించుకునే ముందు ఆ ఉద్యోగానికి అర్హత కలిగిన అమెరికా కార్మికులు అందుబాటులో లేరని యాజమాన్యం నిరూపించాల్సి ఉంటుంది. అంతేకాకుండా విదేశీ ఉద్యోగిని నియమించడం వల్ల అమెరికా కార్మికుల వేతనాలు, ఉద్యోగ అవకాశాలు, పని పరిస్థితులపై ప్రతికూల ప్రభావం ఉండదని కూడా నిర్ధరించాలి. ఈ ప్రక్రియను అమెరికా కార్మిక శాఖ పరిశీలించి అనుమతి ఇస్తుంది. ఆ తర్వాతే గ్రీన్‌కార్డు కోసం ఉద్యోగి తరఫున తదుపరి ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ ముందుకు సాగుతుంది. భారత్‌కు చెందిన అనేక మంది ఐటీ నిపుణులు అమెరికాలోని టెక్ కంపెనీల్లో పనిచేస్తున్నారు. వీరిలో కొందరు దీర్ఘకాలికంగా అమెరికాలో ఉండేందుకు గ్రీన్‌కార్డు కోసం ప్రయత్నిస్తుంటారు. ఇందుకోసం కంపెనీలు ఉద్యోగుల తరఫున ప్రక్రియను చేపడతాయి. ఇలాంటి పరిస్థితుల్లో కాగ్నిజెంట్ ఫైలింగ్స్ నిలిపివేయడం సంస్థలోని విదేశీ ఉద్యోగులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇప్పటికే గ్రీన్‌కార్డు ప్రక్రియలో ఉన్న ఉద్యోగులకు ఈ పరిణామం ఆందోళన కలిగించవచ్చు. అయితే దర్యాప్తు పూర్తయ్యే వరకు సంస్థకు సంబంధించిన అన్ని కేసులపై తుది ప్రభావం ఎలా ఉంటుందనే విషయం స్పష్టంగా తెలియాల్సి ఉంది. ట్రంప్ ప్రభుత్వం వీసా కార్యక్రమాల్లో అక్రమాలు, మోసాలపై మరింత కఠిన వైఖరి అవలంబిస్తోంది. జులైలోనే ఉపాధి వీసా కార్యక్రమాలకు సంబంధించిన మోసం ఆరోపణలపై పెద్ద స్థాయి దర్యాప్తును ప్రారంభించినట్లు సమాచారం. అమెరికా ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని ట్రంప్ యంత్రాంగం స్పష్టం చేస్తోంది. విదేశీ ఉద్యోగులను నియమించుకునే సమయంలో నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో కాగ్నిజెంట్, క్లౌడెరాపై తాజా చర్య ప్రాధాన్యం సంతరించుకుంది.

# కెనడా ఉత్పత్తులపై అమెరికా నిషేధం

### అమల్లోకి తెచ్చిన ప్రతీకార సుంకాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 09:** అమెరికా– కెనడా మధ్య వాణిజ్య వివాదం మరింత ముదిరింది. కెనడా విధించిన ప్రతీకార సుంకాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. కెనడా నుంచి దిగుమతి అయ్యే వాహనాలు, ఆటో విడిభాగాలు, మద్యం, పాల ఉత్పత్తులపై ఆంక్షలు విధిస్తూ ఏకంగా ఐదు ఉత్తర్వులు జారీ చేశారు. భారీ, దీర్ఘకాలిక అమెరికా ప్రభుత్వ కాంట్రాక్టుల్లో కెనడియన్ ఉత్పత్తులపై నిషేధం వించాలని జనరల్ సర్వీసెస్ అడ్మినిస్ట్రేషన్‌ను ఆదేశించారు. అమెరికా ఉత్పత్తులకు కెనడా పూర్తి న్యాయమైన పరస్పర ప్రయోజనం కల్పించే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఎంపిక చేసిన కెనడియన్ వాహనాలు, ఆటోమొబైల్ విడిభాగాలను అమెరికాలోకి దిగుమతి చేయకుండా నిషేధించేలా ట్రంప్ తొలి ఉత్తర్వును జారీ చేశారు. కెనడాలోని కొన్ని ప్రావిన్సులు అమెరికా బీర్, వైన్, స్పిరిట్స్ పంపిణీ, రిటైల్ విక్రయాలు, కొనుగోళ్లపై ఆంక్షలు విధిస్తున్నాయని అమెరికా ఆరోపిస్తోంది. దీనికి ప్రతిస్పందనగా కొన్ని కెనడియన్ ఉత్పత్తులపై అదనపు సుంకాలు విధించే పరిధిని మార్చుతూ ట్రంప్ రెండో ఉత్తర్వు జారీ చేశారు. ఎంపిక చేసిన కెనడియన్ డెయిరీ ఉత్పత్తులను అమెరికాలోకి దిగుమతి చేసుకోకుండా నేరుగా నిషేధిస్తూ మూడో ఉత్తర్వు జారీ చేశారు. అమెరికా మద్యం ఉత్పత్తులపై కెనడాలోని ప్రావిన్సులు విధిస్తున్న ఆంక్షలకు ప్రతిగా, ఎంపిక చేసిన కెనడియన్ మద్యం ఉత్పత్తుల దిగుమతులను నిషేధిస్తూ మరో ఉత్తర్వు తీసుకొచ్చారు. మోటార్ వాహనాల వివాదానికి సంబంధించిన అదనపు సుంకాల పరిధిని కూడా ఐదో ఉత్తర్వుతో మార్చారు.



ఇదే సమయంలో అమెరికా ప్రభుత్వ ప్రధాన కొనుగోలు వ్యవస్థ నుంచి కెనడియన్ ఉత్పత్తులను తొలగించాలని ట్రంప్ ఆదేశించారు. జనరల్ సర్వీసెస్ అడ్మినిస్ట్రేషన్ (జీఎస్?ఏ), యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్?టీఆర్)లు ఈ ప్రక్రియను చేపట్టాలని సూచించారు. కెనడా కూడా అమెరికా సంస్థలు, రైతులకు సమానమైన మార్కెట్ అవకాశాలు కల్పించే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని ట్రంప్ స్పష్టం చేశారు. ‘నో రెసిప్రాసిటీ, నో యాక్సెస్’ అనే విధానాన్ని ప్రకటించారు. జీఎస్?ఏ నిర్వహించే మల్టిపుల్ అవార్డ్ షెడ్యూల్స్ నుంచి కెనడాలో తయారైన ఉత్పత్తులను తొలగించాలని సూచించారు. ఈ కొనుగోలు షెడ్యూళ్ల ద్వారా ఏటా 5,000 కోట్ల డాలర్లకుపైగా విలువైన ప్రభుత్వ కొనుగోళ్లు జరుగుతాయని ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు అమెరికా వస్తువులపై కెనడా విధించిన ప్రతీకార సుంకాలు మంగళవారం అర్ధరాత్రి 12:01 గంటలకు అమల్లోకి వచ్చాయి. దాదాపు 2,800 కోట్ల డాలర్ల విలువైన అమెరికా దిగుమతులపై కొత్త టారిఫ్‌లు విధించింది. దాదాపు 700 రకాల అమెరికా ఉత్పత్తులపై 15 శాతం నుంచి 50 శాతం వరకు సుంకాలు అమలవుతున్నాయి. ఉక్కు, అల్యూమినియం వంటి పారిశ్రామిక ముడి పదార్థాలతో పాటు టాయిలెట్ పేపర్, ఆర్కేడ్ గేమ్ మెషీన్లు వంటి ఉత్పత్తులపైనా ఈ ప్రభావం పడనుంది.

# సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్

### తమిళనాడులో కొత్త కూటమికి సన్నాహాలు?

### విజయ్ నాయకత్వంలో ఏర్పాటుకు సిద్ధం

**చెన్నై, సెప్టెంబర్ 09:** తమిళనాడులో కొత్త రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేతృత్వంలోని కొత్త కూటమి ఆవిర్భవించింది. దానికి “సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్” అని పేరు పెట్టారు. చెన్నైలోని పనైయూర్‌లో ఉన్న పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన రెండో కూటమి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పేరే తమ కూటమి సిద్ధాంతాలను, అజెండాను తెలియజేస్తోందని తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ తెలిపారు. తమిళనాడు హక్కుల కోసం పోరాడే పార్టీలన్నీ ఈ కూటమిలో ఉన్నాయని ఆయన చెప్పారు. త్వరలో జరిగే ఉపఎన్నికల్లో కూటమి ఉమ్మడిగా పోటీచేస్తుందని మాణికం ఠాగూర్ ప్రకటించారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, రాష్ట్ర హక్కుల సాధనే ధ్యేయంగా బరిలోకి దిగనున్న కొత్త కూటమి త్వరలో జరిగే ఉపఎన్నికల్లో సత్తా చాటేందుకు వ్యూహరచన చేస్తోంది. టీవీకే వ్యవస్థాపకుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో కాంగ్రెస్, విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే), మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐఎంయూఎల్) వంటి కీలక భాగస్వామ్య పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదు

### సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుంది

### ఎన్‌సీఈఆర్‌టీపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 09:** విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కానీ సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుందని స్పష్టం చేసింది. అయితే న్యాయవ్యవస్థపై విమర్శలను సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా, హేతుబద్ధమైన పద్ధతిలో వ్యక్తం చేయాలని హెచ్చరించింది. విమర్శకు, మౌనానికి మధ్య తేడా లేదని పేర్కొంది. బాధ్యతాయుతమైన చర్చకు, సమాచారం లేని వాదనకు మధ్యే తేడా ఉందని అభిప్రాయపడింది. ఎన్?సీఈఆర్‌టీ ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకంలో ‘న్యాయవ్యవస్థలోని అవినీతి’ అనే అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుమోటోగా స్వీకరించి కేసుపై విచారణను ముగిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. “న్యాయవ్యవస్థ విమర్శలను వ్యతిరేకించదు. వ్యతిరేకించజాలదు. ఒక శక్తివంతమైన రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ పనితీరుపై నిష్పక్షపాతమైన, సమాచారంతో కూడిన, నిర్మాణాత్మకమైన విమర్శలు చేయాలి. ఆ విమర్శలు వ్యవస్థ జవాబుదారీతనానికి, స్వీయ సవరణకు దోహదపడతాయి. న్యాయవ్యవస్థపై విమర్శలు సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతమైన, హేతుబద్ధమైన యంత్రాంగంలో వినిపించాలి. అంతేగానీ సున్నితమైన మనసుల కోసం ఉద్దేశించిన పాఠశాల పాఠ్యప్రణాళికలోకి ధ్రువీకరణ లేకుండా ప్రవేశించకూడదు” అని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన 8వ తరగతి సోషల్ సైన్స్ పుస్తకంలోని ఛాప్టర్ 4 అయిన ‘ది రోల్ ఆఫ్ ది జ్యుడిషియరీ ఇన్ సొసైటీ (సమాజంలో న్యాయ వ్యవస్థ పాత్ర)’ అధ్యాయంలో న్యాయ వ్యవస్థలో అవినీతి, కేసుల పెండింగ్, మౌలిక వసతుల కొరత, న్యాయమూర్తుల కొరత వంటి అంశాలు ఉండటంతో వివాదం మొదలైంది. ఈ అధ్యాయం న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీనిపైనే సుప్రీం కోర్టు సుమోటాగా విచారణ చేపట్టి ఎన్‌సీఈఆర్‌టీపై మండిపడింది. అనంతరం సోషల్ సైన్స్ బుక్‌కు సంబంధించిన ముద్రణ పూర్తైన, అలాగే డిజిటల్ కాపీలన్నింటినీ వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంకా ఆ పుస్తకాన్ని మళ్లీ ముద్రించడం, డిజిటల్ రూపంలో ప్రచురించడం లేదా పంపిణీ చేయడంపై పూర్తి నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్‌సీఆర్‌టీపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టుకు ఎన్‌సీఈఆర్‌టీ క్షమాపణలు చెప్పింది. అనంతరం ఎన్‌సీఈఆర్‌టీ సోషల్ సైన్స్ బుక్‌ను సవరించింది. ఈ క్రమంలో పలు మార్పులు చేసింది. ‘స్వతంత్ర న్యాయ వ్యవస్థ ఎందుకు అవసరం?’ అనే ప్రారంభ ప్రశ్నను తొలగించి ‘న్యాయబద్ధమైన, సామరస్యపూర్వకమైన సమాజం కోసం అసలు న్యాయం ఎందుకు అవసరం? అనే కోణంలో కొత్త అంశాన్ని చేర్చింది. ఇంకా ‘న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు’ అనే విభాగాన్ని పూర్తిగా తొలగించింది. అందులో కోర్టుల్లో న్యాయమూర్తుల కొరత, క్లిష్టమైన న్యాయ ప్రక్రియ, బలహీనమైన మౌలిక వసతులే కారణమని ఉంది. ఈ అంశాన్ని పుస్తకం నుంచి తొలగించింది. అసలు ఈ వివాదానికి కేంద్ర బిందువుగా ఉన్నటువంటి న్యాయ వ్యవస్థలో అవినీతి అనే విభాగాన్ని కూడా పూర్తిగా తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త అధ్యాయంతో కూడిన కొత్త ఎన్‌సీఈఆర్‌టీ బుక్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారని సెప్టెంబరు 1న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలియజేశారు. దీంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎన్‌సీఈఆర్‌టీ బుక్ వివాదం సివిల్ సుమోటో రిట్ పిటిషన్‌ను మూసివేసింది. కాగా, కేంద్రం ఏర్పాటు చేసిన నిపుణుల బృందం సూచించిన సవరణల ఆధారంగా వివాదాస్పద అధ్యాయాన్ని ఎన్‌సీఈఆర్‌టీ మార్చిందని సుప్రీంకోర్టు గమనించింది. కేంద్ర ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి సుప్రీంకోర్టు (రిటైర్డ్) జడ్జి జస్టిస్ ఇందు మల్హోత్రా నేతృత్వం వహించారు. ఈ కమిటీలో సీనియర్ న్యాయవాది, భారతదేశ మాజీ అటార్నీ జనరల్ కె.కె. వేణుగోపాల్, ప్రొఫెసర్ ప్రకాశ్ సింగ్ ఉన్నారు.

# ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో సాంకేతిక సమస్య

### ప్రపంచ వ్యాప్తంగా వెయ్యికిపైగా విమానాలు రద్దు!


### భారత్ విమానయాన సంస్థలపైనా తీవ్ర ప్రభావం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 09:** బ్రిటన్‌లో మంగళవారం విమాన ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా దేశవ్యాప్తంగా విమాన రాకపోకలకు భారీ అంతరాయం ఏర్పడింది. 1,000కుపైగా విమానాలు రద్దు కాగా, మరెన్నో విమానాలు గంటల తరబడి ఆలస్యమయ్యాయి. దీని ప్రభావం భారత్? విమానయాన సంస్థలపై కూడా పడింది. విమాన ట్రాకింగ్ సంస్థ ఫ్లైట్‌రాడార్24 ప్రకారం, ఈ అంతరాయం ప్రభావం బ్రిటన్‌లోని 15 విమానాశ్రయాలకు వ్యాపించింది. విమానాశ్రయాల టెర్మినల్స్‌తో పాటు రన్‌వేలపైనా ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. అయితే బ్రిటన్ నేషనల్ ఎయిర్ ట్రాఫిక్ సర్వీసెస్ (ఎన్?ఏటీఎస్) తన ఫ్లైట్ ప్రాసెసింగ్ వ్యవస్థలో తలెత్తిన సమస్యను సాయంత్రానికి పరిష్కరించినట్లు తెలిపింది. కానీ అప్పటికే భారీ సంఖ్యలో విమానాలు ఆలస్యమవడంతో దాని ప్రభావం చాలా గంటల పాటు కొనసాగింది. విమానాలు, సిబ్బంది తమ షెడ్యూల్ స్థానాల్లో లేకపోవడంతో సేవలను సాధారణ స్థితికి తీసుకురావడం విమానయాన సంస్థలకు సవాలుగా మారింది. లండన్?లోని హీత్రో విమానాశ్రయంలో విమానాల బయలుదేరే సేవలు తిరిగి ప్రారంభమైనప్పటికీ, రాత్రంతా వచ్చే విమానాలను నిలిపివేశారు. ప్రయాణికులు తమ విమానాల పరిస్థితిని సంబంధిత ఎయిర్‌లైన్స్ ద్వారా తెలుసుకోవాలని విమానాశ్రయ అధికారులు సూచించారు.

# మంగళగిరిలో ఏఐ వైద్య విప్లవం!

- రక్త పరీక్ష లేకుండానే 60 సెకన్లలో 60 ఆరోగ్య పరీక్షలు
- గణపతినగర్ యూపీహెచ్‌సీలో ఫేషియల్ స్కాన్ ట్రయల్ రన్ విజయవంతం







**మంగళగిరి, సెప్టెంబర్ 9:** వైద్య రంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికతతో సరికొత్త అధ్యాయానికి మంగళగిరి వేదికగా నిలుస్తోంది. గణపతినగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో 'ఎరోస్ వెల్నెస్' ఆధ్వర్యంలో ఏఐ ఆధారిత ఆరోగ్య పరీక్షల విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నారు. రక్త నమూనాలు సేకరించాల్సిన అవసరం లేకుండా కేవలం 60 సెకన్లలో 60 రకాల ఆరోగ్య పరీక్షల నివేదికలు అందించేలా ఈ సాంకేతికతను రూపొందించారు. రోగి ముఖాన్ని స్కాన్ చేయడం ద్వారా 28 రకాల శారీరక కొలమానాలను గుర్తించడంతో పాటు, జీవ-సంవేదకాలు, ఆధునిక స్క్రీనింగ్ పరికరాల ద్వారా మరో 32 రకాల పరీక్షలను నిర్వహించనున్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు ఒత్తిడి, ఆందోళన స్థాయిల వంటి మానసిక ఆరోగ్య సూచికలను కూడా అంచనా వేయనున్నట్లు అధికారులు తెలిపారు. నివేదికల ఆధారంగా ముందస్తు జాగ్రత్తలు, ఆరోగ్య పరిరక్షణపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన, కౌన్సెలింగ్ అందించనున్నారు. ఈ సేవలను ప్రారంభించేందుకు వైద్య, ల్యాబ్ సిబ్బందికి రెండు రోజుల ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు రాష్ట్ర నోడల్ అధికారి శ్యామల తెలిపారు. శిక్షణ అనంతరం పూర్తిస్థాయి సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే యూపీహెచ్‌సీలో ఫేషియల్ స్కాన్ ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎరోస్ వెల్నెస్ సీఈవో శిల్పా దేశాయ్, యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనూష పరుచూరి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేకుండా వినాయక మండపం ఏర్పాటు చేయొద్దు!

**పల్నాడులో సింగిల్ విండో ఆన్‌లైన్ విధానం ప్రారంభం**

**పోలీస్, ఫైర్, విద్యుత్, రెవెన్యూ తదితర అనుమతులు ఒకే చోట.. ఉచితం**



**పల్నాడు, సెప్టెంబర్ 9:** వినాయక చవితి వేడుకల నేపథ్యంలో పల్నాడు జిల్లాలో వినాయక మండపాలు, విగ్రహాల ఏర్పాటుకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని జిల్లా అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి స్పష్టం చేశారు. నిర్వాహకుల సౌకర్యార్థం పోలీస్, ఫైర్, మున్సిపల్/పంచాయతీ, విద్యుత్, రెవెన్యూ శాఖల అనుమతులను ఒకే చోట పొందేలా ఆన్‌లైన్ సింగిల్ విండో విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. నిర్వాహకులు ganeshutsav.net పోర్టల్ (https://reference-url-citation.invalid/0)లో మొబైల్ నంబర్‌తో న్యూ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్, స్థల వివరాలు, మండప పరిమాణం, నిమజ్జన తేదీ, మార్గం తదితర వివరాలతో అవసరమైన పత్రాలను సమర్పించాలి. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అనుమతులు మంజూరవుతాయి. అనంతరం~ు= కోడ్‌తో కూడిన డిజిటల్ చీటీజను డౌన్‌లోడ్ చేసుకుని మండపం వద్ద కనిపించేలా ఏర్పాటు చేయాలి. మండపాల వద్ద తగిన వెలుతురు, అగ్నిమాపక పరికరాలు, పారిశుధ్యం, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని అధికారులు సూచించారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్‌స్పీకర్ల వినియోగం నిషేధం అని స్పష్టం చేశారు. అధికారికంగా గుర్తించిన ప్రాంతాల్లోనే విగ్రహాల నిమజ్జనం నిర్వహించాలని, నదులు, కాలువలు, చెరువులు, తాగునీటి వనరుల్లో అనధికారికంగా నిమజ్జనం చేయరాదని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో బారికేడ్లు, లైఫ్ జాకెట్లు, రక్షణ పడవలు, అంబులెన్స్ వంటి భద్రతా ఏర్పాట్లు ఉంటాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడినా, అనధికార మార్గాల్లో ఊరేగింపులు నిర్వహించినా, శబ్ద కాలుష్య నిబంధనలు ఉల్లంఘించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలకు ప్రాధాన్యమిస్తూ, నిబంధనలు పాటించి వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలని ప్రజలను కోరారు.

# 25 వేల మంది విద్యార్థులతో గ్రీన్ గణేష్

**ప్రపంచ రికార్డుకు గుంటూరు సిద్ధం**




**గుంటూరు, సెప్టెంబర్ 9:** పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడంతో పాటు నవగుంటూరు నిర్మాణంలో వారిని భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ఈ నెల 11న 25 వేల మంది విద్యార్థులతో ఏకకాలంలో మట్టి వినాయక విగ్రహాల తయారీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, విద్యాశాఖ, జీఎంసీ అధికారులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల భూమి, నీరు, గాలి కలుషితమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 11న మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు సుమారు 60 పాఠశాలల్లో విద్యార్థులు తమ పాఠశాల ప్రాంగణాల్లోనే జీఎంసీ అందించే విత్తనాలు కలిపిన మట్టితో వినాయక విగ్రహాలను తయారు చేయనున్నారు. ఈ కార్యక్రమం వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. పాల్గొనే ప్రతి విద్యార్థికి, పాఠశాలకు జీఎంసీ తరఫున అభినందన సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు. విద్యార్థులను బలవంతంగా కాకుండా స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొనేలా పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. కార్యక్రమానికి సంబంధించి ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ జి.సాంబశివరావు, డిప్యూటీ కమిషనర్లు, వైద్య, ఇంజినీరింగ్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# రైతుల సాగునీటి కోసం వైఎస్సార్‌సీపీ పోరుబాట

- సాగునీటి సమస్య పరిష్కారం కోసం పోరాట యాత్రలు
- గురువారం బాపట్ల.. శుక్రవారం కర్లపాలెం.. శనివారం పిట్టలవానిపాలెంలో కార్యక్రమాలు



**బాపట్ల సెప్టెంబర్ 9:** రైతుల సంక్షేమం, సాగునీటి సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బాపట్ల నియోజకవర్గంలో వరుసగా పోరాట యాత్రలు నిర్వహించనున్నట్లు మాజీ డిప్యూటీ స్పీకర్, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. సాగునీటి కొరతతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వ్యవసాయానికి అవసరమైన నీటిని అందించాలనే డిమాండ్‌తో ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు సాగునీరు అత్యంత కీలకమని కోన రఘుపతి పేర్కొన్నారు. సాగునీటి లభ్యతలో ఇబ్బందులు ఏర్పడితే పంటల సాగు, దిగుబడులు, రైతుల ఆదాయంపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే పోరాట యాత్రల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో సాగునీటి పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ యాత్రల ద్వారా పరిశీలించనున్నట్లు చెప్పారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, సాగునీటి సరఫరా విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి స్పష్టమైన డిమాండ్లను వినిపించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం బాపట్లలో, శుక్రవారం కర్లపాలెంలో, శనివారం పిట్టలవానిపాలెంలో పోరాట యాత్రలు నిర్వహించనున్నట్లు కోన రఘుపతి తెలిపారు. ఆయా ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. రైతుల ప్రయోజనాల కోసం నిర్వహిస్తున్న ఈ పోరాట యాత్రల్లో రైతులు, వ్యవసాయ రంగానికి సంబంధించిన వర్గాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోన రఘుపతి పిలుపునిచ్చారు. సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు రైతుల తరఫున తమ పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.



# అర్జీల పరిష్కారానికి చర్యలు

**సమస్యలను పరిశీలించి తగిన పరిష్కారం చూపిస్తాం: కలెక్టర్**

**బాపట్ల, సెప్టెంబర్ 9:** జిల్లాలోని వివిధ మండలాల నుంచి పలు సమస్యల పరిష్కారం కోసం బుధవారం జిల్లా కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీదారుల నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్‌కుమార్ అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అర్జీదారులు తమకు సంబంధించిన భూ సమస్యలు, ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, రెవెన్యూ, పెన్షన్లు తదితర అంశాలపై తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిబంధనల మేరకు సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి, నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వారి సమస్యలను సానుకూలంగా విని, పరిష్కార మార్గాలను చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.

# ప్రజలపై భారాలు.. పాలకులకు ఆర్భాటాలు

**ధరలు తగ్గించకపోతే గిడ్డంగుల ముట్టడి**

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య**





**మంగళగిరి సెప్టెంబర్ 9:** నిత్యావసర ధరలు భారీగా పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుధవారం మంగళగిరిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంఆర్వో కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు ధరల నియంత్రణ కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ.. గత 15 రోజుల్లో 25 కిలోల బియ్యం బస్తా ధర రూ.400--500 వరకు పెరిగిందని, చక్కెర ధర కిలో రూ.35-40 నుంచి రూ.75కు చేరిందని తెలిపారు. వంటనూనె, బెల్లం, ఉల్లి తదితర నిత్యావసరాల ధరలు కూడా పెరగడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారం పడుతోందన్నారు. బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టి నిత్యావసర ధరలను తక్షణమే నియంత్రించాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళగిరి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి నారా లోకేష్ ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు. వారం రోజుల్లో ధరలు అదుపులోకి రాకపోతే ప్రజలను సమీకరించి గిడ్డంగుల ముట్టడికి దిగుతామని, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఈశ్వరయ్య హెచ్చరించారు. ప్రభుత్వం ప్రజలకు పొదుపు సూచనలు చేసే ముందు ప్రభుత్వ ఖర్చుల్లోనే పొదుపు పాటించాలని అన్నారు. మంగళగిరి ప్రాంత రైతులు మొక్కజొన్న, వరి, మిరప తదితర పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులకు మద్దతు ధర కల్పించడంతో పాటు తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నాయకులు కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, చంద్ర నాయక్, అన్నవరపు ప్రభాకర్, జాలాది జాన్‌బాబు, సయ్యద్ కరీముల్లా, చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తాగు నీటి చెరువులు నింపాలి

**గుంటూరు, సెప్టెంబర్ 9 :** ఎల్ నినో ప్రభావం దృష్ట్యా తాగునీటి సరఫరాకు సమస్యలు తలెత్తకుండా తాగు నీటి చెరువులు నింపాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు. తాగు నీటి చెరువుల నిలువలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బుధవారం సమీక్షించారు. నాలుగు రోజులలో తాగు నీటి చెరువులు నింపాలన్నారు. వర్షాధారిత చెరువులు నింపడానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఒగేరువాగు నింపడం ద్వారా దాని పరిధిలో ఉన్న గ్రామాలకు తాగు నీటిని అందించుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 75 శాతం కంటే ఎక్కువ నీరు నింపాల్సిన 50 చెరువులపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్.ఎస్.పి) నుండి వస్తున్న నీరు ఎవరు ఎక్కడా దారి మళ్ళించే చర్యలు చేపట్టకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ పది రోజుల్లో లక్ష్యం మేరకు చెరువులలో నీరు నింపుట జరుగుతుందన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్.ఎస్.పి) నుంచి గుంటూరు చానల్ కు నీరు విడుదల చేయడం ద్వారా దాని కిందన గల చెరువులు నింపుటకు అవకాశం ఉందని జలవనరుల శాఖ ఇంజనీర్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జలవనరుల శాఖ ఇంజనీర్లు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీర్లు పాల్గొన్నారు.



# వరద గుప్పిట్లో ఆసియా క్రీడల వేదిక!

## నాగోయాలో కుండపోత వర్షాలు

## అథ్లెట్లను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

## గంటలోనే 104 మిల్లీమీటర్ల వర్షపాతం

## రవాణా సేవలకు తీవ్ర అంతరాయం

## క్రీడలకు ఇబ్బంది లేదంటున్న అధికారులు

**నాగోయా, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** జపాన్‌లో జరగనున్న ఆసియా క్రీడలపై భారీ వర్షాలు, వరదల ప్రభావం పడుతోంది. క్రీడలకు ప్రధాన వేదికగా ఉన్న నాగోయాలో కుండపోత వర్షాలు కురుస్తుండటంతో ముందు జాగ్రత్తగా వందలాది మంది అథ్లెట్లు, సహాయక సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే పోటీ వేదికలకు ఎలాంటి నష్టం జరగలేదని, నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే క్రీడలు జరుగుతాయని నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు. నాగోయాలో మంగళవారం ఒక్క గంట వ్యవధిలోనే 104 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. భారీ వర్షాలతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో అథ్లెట్ల భద్రతను దృష్టిలో పెట్టుకుని అత్యవసర చర్యలు చేపట్టారు. క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక వసతి ప్రాంతాల్లోని వారిని ముందు జాగ్రత్తగా ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించారు. షిప్పింగ్ కంటైనర్లతో ఏర్పాటు చేసిన తాత్కాలిక వసతి కేంద్రాల్లో ఉన్నవారిని కూడా మార్చినట్లు సమాచారం. దాదాపు 400 మంది క్రీడాకారులు, ఇతర సిబ్బంది తాత్కాలిక ఆశ్రయ కేంద్రాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అథ్లెట్లందరూ సురక్షితంగానే ఉన్నారని జపాన్ అధికారులు వెల్లడించారు. వర్షాలు, వరదల కారణంగా క్రీడా వేదికలకు ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదని పేర్కొన్నారు.

### రవాణాపై వర్షాల దెబ్బ

నాగోయాలోని పలు ప్రాంతాలు నీటమునగడంతో ప్రజా రవాణాపైనా ప్రభావం పడింది. కొన్ని సబ్‌వే, బస్సు సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు సమాచారం. మరింత భారీ వర్షం కురిసే అవకాశం ఉండటంతో స్థానిక యంత్రాంగం అప్రమత్తమైంది. వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టింది. ఆసియా క్రీడలు సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న నేపథ్యంలో వివిధ దేశాలకు చెందిన క్రీడాకారులు జపాన్‌కు చేరుకుంటున్నారు. దీంతో వాతావరణ పరిస్థితులను నిర్వాహకులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రస్తుతానికి ఆసియా క్రీడల నిర్వహణకు ముప్పు లేదని అధికారులు చెబుతున్నప్పటికీ.. భారీ వర్షాలు కొనసాగితే ఏర్పడే పరిస్థితులపై ఆందోళన నెలకొంది. అథ్లెట్ల భద్రతతో పాటు రవాణా, వసతి ఏర్పాట్లు ఇప్పుడు నిర్వాహకులకు ప్రధాన సవాల్‌గా మారాయి.




# హోరాహోరీ పోరులో ఆల్కరాజ్ ఔట్..

## యూఎస్ ఓపెన్ సెమీస్‌లోకి బెన్ షెల్టన్

**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ నుంచి డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కరాజ్ నిష్క్రమించాడు. ఇవాళ హోరాహోరీగా జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో అమెరికన్ ప్లేయర్ బెన్ షెల్టన్ అద్భుత విజయాన్ని నమోదు చేశాడు. అయిదు సెట్ల థ్రిల్లింగ్ మ్యాచ్‌ను 6-7(5), 6-1, 6-3, 1-6, 7-6(7) స్కోరుతో షెల్టన్ గెలుచుకున్నాడు. మడిమ గాయం నుంచి కోలుకుని టోర్నీలో అడుగుపెట్టిన అల్కరాజ్.. ఈ మ్యాచ్‌లో చివరి వరకు పోరాడు. సుమారు 4 గంటల 28 నిమిషాల పాటు ఈ మ్యాచ్ జరిగింది. అల్కరాజ్‌పై తన కెరీర్‌లో తొలిసారి విజయం సాధించాడు బెన్. నాలుగు నెలల గాయం తర్వాత అల్కరాజ్ ఆడిన ఫస్ట్ టోర్నీ ఇదే. కానీ అతని ఆశలపై నీళ్లు చల్లాడు యువ ప్లేయర్ షెల్టన్. గాయం వల్ల స్పెయిన్ ప్లేయర్ అల్కరాజ్ సరైన రీతిలో తన సత్తాను ప్రదర్శించలేకపోయాడు. సమారు 52 అన్‌ఫోర్స్‌డ్ ఎర్రర్స్ చేశాడు. టైబ్రేకర్ వరకు వెళ్లిన తొలి సెట్‌ను అల్కరాజ్ చివరకు సొంతం చేసుకున్నాడు. కానీ ఆ తర్వాత చాలా భీకరంగా షెల్టన్ చెలరేగిపోయాడు. రెండవ, మూడవ సెట్లను బెన్ ఈజీగా నెగ్గేశాడు. ఫోర్‌హ్యాండ్ షాట్లతో ఆకట్టుకున్నాడు. కానీ నాలుగో సెట్‌లో అల్కరాజ్ తన రిథమ్‌ను మళ్లీ అందుకున్నాడు. బేస్‌లైన్ షాట్లు, స్పీడ్‌తో ఆ సెట్‌ను 6-1 తేడాతో నెగ్గి మ్యాచ్‌ను డిసైడర్ సెట్‌లోకి పంపాడు. ఇక ఆ ఫైనల్ సెట్‌లో ఇద్దరూ అమీతుమీ అన్నట్లుగా ఆడారు. సూపర్ టైబ్రేక్‌కు ఆ సెట్ వెళ్లింది. స్టేడియంలో మ్యాచ్‌ను వీక్షిస్తున్న ప్రేక్షకులు తీవ్ర ఉత్కంఠకు లోనయ్యారు. కానీ చివరకు బెన్ షెల్టన్ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. 10-7తో టైబ్రేక్ సాధించాడు. దీంతో అతను రెండోసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్‌లోకి ప్రవేశించాడు. న్యూయార్క్‌లోని ఆర్థర్ ఆషే స్టేడియంలో క్వార్టర్స్ మ్యాచ్‌ను ఆలస్యంగా ప్రారంభించారు. దీనికి తోడుగా 4 గంటలకు పైగా మ్యాచ్ సాగడం వల్ల.. తెల్లవారుజామున మూడున్నరకు మ్యాచ్ ముగిసింది.

# బిగ్‌బాష్‌లోకి ప్రైవేట్ ఎంట్రీ

- ఐపీఎల్ ఓనర్లకు బంపర్ ఛాన్స్!
- ప్రైవేట్ పెట్టుబడులకు క్రికెట్ ఆస్ట్రేలియా గ్రీన్‌సిగ్నల్
- 2027-28 సీజన్ నుంచి కొత్త యాజమాన్య విధానం
- తొలుత మెల్‌బోర్న్ రెనెగేడ్స్ విక్రయానికి రంగం సిద్ధం
- ప్రపంచ టీ20 మార్కెట్‌లో ఐపీఎల్ యజమానులకు మరో అవకాశం
- నియంత్రణ మాత్రం క్రికెట్ ఆస్ట్రేలియా చేతుల్లోనే



**మెల్‌బోర్న్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** ఆస్ట్రేలియా క్రికెట్‌లో కీలక పరిణామం చోటుచేసుకోనుంది. దేశంలో అత్యంత ఆదరణ పొందిన బిగ్‌బాష్ లీగ్‌లో ప్రైవేట్ పెట్టుబడులకు తలుపులు తెరిచేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా సిద్ధమైంది. 2027-28 సీజన్ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుండగా.. మెల్‌బోర్న్ రెనెగేడ్స్‌ను తొలిసారిగా పూర్తిస్థాయి ప్రైవేట్ యాజమాన్యానికి అప్పగించే దిశగా అడుగులు పడుతున్నట్లు సమాచారం. ఈ నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా పలు టీ20 జట్లను కలిగి ఉన్న ఐపీఎల్ ఫ్రాంచైజీ యజమానులకు మరో భారీ మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఇప్పటివరకు ప్రపంచంలోని ప్రధాన టీ20 లీగ్‌లతో పోలిస్తే బిగ్‌బాష్‌లో ప్రైవేట్ ఫ్రాంచైజీ యాజమాన్యానికి అవకాశం లేకపోవడం ప్రత్యేకత. తాజా నిర్ణయంతో ఆ పరిస్థితి మారనుంది. అయితే బిగ్‌బాష్‌ను పూర్తిగా ప్రైవేట్ సంస్థల చేతుల్లో పెట్టకుండా కీలక నియంత్రణలను క్రికెట్ ఆస్ట్రేలియానే కొనసాగించనున్నట్లు సమాచారం.

### ఐపీఎల్ ఓనర్ల కన్ను పడితే..!

ఐపీఎల్ జట్ల యజమానులు ఇప్పటికే దక్షిణాఫ్రికా, యూఏఈ, అమెరికా, వెస్టిండీస్, ఇంగ్లండ్ సహా వివిధ దేశాల్లోని టీ20 లీగ్‌ల్లో పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు ఆస్ట్రేలియా మార్కెట్ కూడా అందుబాటులోకి వస్తే ప్రపంచ టీ20 క్రికెట్‌లో వారి వ్యాపార సామ్రాజ్యం మరింత విస్తరించే అవకాశం ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్, ఆర్‌పీ-సంజీవ్ గోయెంకా గ్రూప్, జీఎంఆర్-జేఎస్‌డబ్ల్యూ వంటి సంస్థలు ఇప్పటికే వివిధ దేశాల్లో ఫ్రాంచైజీలను నిర్వహిస్తున్నాయి. బిగ్‌బాష్‌లోనూ జట్లను సొంతం చేసుకుంటే ఒకే యాజమాన్యం కింద వివిధ లీగ్‌ల్లో ఆటగాళ్లను కొనసాగించే వ్యూహాలకు మరింత అవకాశం లభించవచ్చు.

### ఒకే బ్రాండ్.. పలు లీగ్‌లు

కామెరాన్ గ్రీన్, టిమ్ డేవిడ్, గ్లెన్ మ్యాక్స్‌వెల్ వంటి అంతర్జాతీయ ఆటగాళ్లను ఒకే యాజమాన్యానికి చెందిన ఐపీఎల్, ఎస్‌ఏ20, మేజర్ లీగ్ క్రికెట్, బిగ్‌బాష్ జట్లలో ఒప్పందాల ద్వారా కొనసాగించే అవకాశాలు పెరగవచ్చు. తద్వారా ఆటగాళ్ల నిర్వహణతో పాటు ఒకే బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించుకునేందుకు ఫ్రాంచైజీలకు అవకాశం ఉంటుంది. అయితే ఇక్కడే మరో సమస్య ఉంది. బిగ్‌బాష్ సాధారణంగా డిసెంబర్--జనవరిలో జరుగుతుండగా అదే సమయంలో దక్షిణాఫ్రికా ఎస్‌ఏ20, యూఏఈ అంతర్జాతీయ లీగ్ టీ20 కూడా జరుగుతాయి. ఒకే యాజమాన్యానికి వివిధ లీగ్‌ల్లో జట్లు ఉంటే స్టార్ ఆటగాళ్లను ఏ జట్టుకు కేటాయించాలన్న విషయంలో అంతర్గత పోటీ తప్పకపోవచ్చు.

### భారత స్టార్లకు మాత్రం నో ఎంట్రీ

ఐపీఎల్ యజమానులు బిగ్‌బాష్ జట్లను కొనుగోలు చేసినా భారత పురుష క్రికెటర్లను అక్కడ ఆడించడం ప్రస్తుత నిబంధనల ప్రకారం సాధ్యం కాదు. భారత క్రికెట్ నియంత్రణ మండలి తన క్రికెటర్లు విదేశీ టీ20 లీగ్‌ల్లో పాల్గొనేందుకు సాధారణంగా అనుమతించడం లేదు. అయితే భారత మహిళా క్రికెటర్లు గతంలో బిగ్‌బాష్‌లో పాల్గొన్నారు. భవిష్యత్తులో రిటైర్డ్ లేదా ఒప్పంద పరిధిలో లేని పురుష ఆటగాళ్ల విషయంలో భారత బోర్డు నిబంధనలు సడలిస్తే బిగ్‌బాష్‌లో పెట్టుబడులు పెట్టే భారత ఫ్రాంచైజీలకు అదనపు ప్రయోజనం కలిగే అవకాశం ఉంది.

### పగ్గాలు మాత్రం సీఏ చేతుల్లోనే

ప్రైవేట్ పెట్టుబడులకు అవకాశం కల్పించినా బిగ్‌బాష్‌పై క్రికెట్ ఆస్ట్రేలియా నియంత్రణ కొనసాగనుంది. అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్, ఆటగాళ్ల లభ్యత, ప్రసార హక్కులు, జీతాల పరిమితి వంటి కీలక అంశాల్లో బోర్డుదే ప్రధాన పాత్రగా ఉండనుంది. ఫ్రాంచైజీలను కొనుగోలు చేయాలనుకునే సంస్థలను ఆమోదించడం లేదా తిరస్కరించే అధికారం కూడా క్రికెట్ ఆస్ట్రేలియాకే ఉండనున్నట్లు సమాచారం. యాజమాన్య వైవిధ్యాన్ని కాపాడేందుకు ఒకే దేశానికి లేదా ఒకే వర్గానికి చెందిన సంస్థలు ఎన్ని జట్లను సొంతం చేసుకోవచ్చన్న అంశంలోనూ పరిమితులు విధించే అవకాశముంది. మొత్తానికి బిగ్‌బాష్‌లో ప్రైవేట్ పెట్టుబడులకు తలుపులు తెరుచుకుంటే ప్రపంచ టీ20 క్రికెట్ వ్యాపారంలో మరో కీలక మార్పునకు నాంది పడనుంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఫ్రాంచైజీలను విస్తరిస్తున్న ఐపీఎల్ యజమానులకు ఆస్ట్రేలియా మార్కెట్ ఇప్పుడు కొత్త ఆకర్షణగా మారే అవకాశముంది.

# 100 వికెట్ల క్లబ్‌లో రాబిన్సన్ 'స్పెషల్'!

- 24వ టెస్టులోనే వంద వికెట్ల మైలురాయి
- సయీమ్ అయూబ్‌ను ఔట్ చేసి ఘనత
- 20లోపు సగటుతో అరుదైన రికార్డు
- బుమ్రా సరసన ఇంగ్లండ్ పేసర్
- పాక్‌పై వరుసగా మూడో టెస్టులోనూ జోరు







**బర్మింగ్‌హామ్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** ఇంగ్లండ్ పేసర్ ఓలీ రాబిన్సన్ టెస్టు క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. పాకిస్థాన్‌తో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా బుధవారం ప్రారంభమైన మూడో టెస్టులో సయీమ్ అయూబ్‌ను ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసి తన టెస్టు కెరీర్‌లో 100వ వికెట్‌ను పూర్తి చేసుకున్నాడు. 32 ఏళ్ల రాబిన్సన్‌కు ఇది 24వ టెస్టు కావడం విశేషం. అంతేకాదు.. 100 వికెట్ల మైలురాయి చేరే సమయానికి 20 కంటే తక్కువ బౌలింగ్ సగటు కలిగిన అత్యంత అరుదైన ఆధునిక బౌలర్ల జాబితాలో రాబిన్సన్ చోటు సంపాదించాడు. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం గత వందేళ్లలో 100 టెస్టు వికెట్లు తీసిన సమయంలో అత్యుత్తమ సగటు నమోదు చేసిన బౌలర్‌గా రాబిన్సన్ నిలిచాడు. జస్ప్రీత్ బుమ్రా పేరిట ఉన్న రికార్డును అధిగమించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

### సయీమ్‌తోనే 'సెంచరీ'

టాస్ గెలిచిన ఇంగ్లండ్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. రాబిన్సన్ తన తొలి ఓవర్‌లోనే సయీమ్ అయూబ్‌ను ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసినప్పటికీ సమీక్షలో నిర్ణయం మారింది. అయితే తన తర్వాతి ఓవర్‌లోనే సయీమ్‌ను ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్‌కు పంపి 100వ వికెట్ మైలురాయిని అందుకున్నాడు.


### పాక్‌పై రాబిన్సన్ 'రాజ్'

ప్రస్తుత సిరీస్‌లో రాబిన్సన్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. తొలి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఎనిమిది వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. రెండో టెస్టులోనూ 4-11, 4-24తో మరో ఎనిమిది వికెట్లు తీసి వరుసగా రెండోసారి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. రెండేళ్లకు పైగా టెస్టు జట్టుకు దూరంగా ఉండి తిరిగి వచ్చిన రాబిన్సన్.. ఇప్పుడు 100 వికెట్ల మైలురాయితో తన పునరాగమనాన్ని మరింత ప్రత్యేకంగా మార్చుకున్నాడు.


# రూ.130 కోట్లకు పైగా డీల్!

## బీసీసీఐతో చాట్‌జీపీటీ, క్యాంపా, ఎస్‌బీఐ లైఫ్ ఒప్పందం

- మూడు దిగ్గజ బ్రాండ్లు అసోసియేట్ పార్ట్‌నర్లుగా ఎంపిక
- రూ.130 కోట్లకు పైగా ఆదాయంతో 44 శాతం వృద్ధి
- 2028 మార్చి వరకు భారత్‌లో జరిగే మ్యాచ్‌లకు వర్తింపు




**ముంబై, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తమ స్వదేశీ క్రికెట్ సీజన్‌కు సంబంధించి ప్రముఖ పానీయాల బ్రాండ్ 'క్యాంపా', ఇన్సూరెన్స్ సంస్థ 'ఎస్‌బీఐ లైఫ్'తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ 'చాట్‌జీపీటీ'లను అసోసియేట్ పార్ట్‌నర్లుగా ప్రకటించింది. రాబోయే వెస్టిండీస్ సిరీస్‌తో ప్రారంభమై 2028 మార్చి వరకు (మొత్తం 35 మ్యాచ్‌లకు) ఈ భాగస్వామ్యం అమల్లో ఉండనుంది. ఈ రెండు సీజన్ల ఒప్పందం ద్వారా బీసీసీఐకి రూ.130 కోట్లకు పైగా ఆదాయం లభించనుండగా, గత సైకిల్‌తో పోలిస్తే ఒప్పంద విలువ ఏకంగా 44 శాతం పెరగడం విశేషం. బిడ్డింగ్‌లో క్యాంపా కోలా మ్యాచ్‌కు రూ.1.31 కోట్లు, ఎస్‌బీఐ లైఫ్ మరియు చాట్‌జీపీటీ మ్యాచ్‌కు రూ.1.2 కోట్ల చొప్పున బిడ్లు దాఖలు చేసి భాగస్వామ్య హక్కులను సొంతం చేసుకున్నాయి. ఈ సందర్భంగా బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, గౌరవ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. ఏఐ, ఇన్సూరెన్స్, బెవరేజెస్ వంటి విభిన్న రంగానికి చెందిన అంతర్జాతీయ బ్రాండ్లు భారత క్రికెట్‌పై చూపుతున్న నమ్మకానికి ఈ భారీ డీల్ నిదర్శనమని తెలిపారు. భారత హోమ్ సీజన్ మార్కెట్‌లో ఎంతటి క్రేజ్, డిమాండ్ ఉందో ఈ 44 శాతం వృద్ధి స్పష్టం చేస్తోందని వారు ఆనందం వ్యక్తం చేశారు. గ్రౌండ్ బ్రాండింగ్, బ్రాడ్‌కాస్ట్ గ్రాఫిక్స్ ద్వారా ఈ బ్రాండ్లు ప్రచారం పొందనున్నాయి.




# డూప్ వద్దు.. నేనే దూకేస్తా

## 'సర్దార్ 2' సెట్స్‌లో మాళవిక సాహసం


హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్): నటుడు కార్తి కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'సర్దార్ 2' చిత్రంలో నటిస్తున్న భామ మాళవిక మోహనన్ యాక్షన్ సన్నివేశాల్లో డూప్ (బాడీ డబుల్) లేకుండా నటించి చిత్ర బృందాన్ని ఆశ్చర్యపరిచింది. పి.ఎస్. మిత్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ తొలిరోజే రోప్‌ల సాయంతో ఎత్తైన ప్రదేశం నుండి స్విమ్మింగ్ పూల్‌లోకి దూకే రిస్కీ సీన్ ఇచ్చారని, డూప్‌ను వద్దని చెప్పి స్వయంగా తానే ఆ స్టంట్‌ను పూర్తి చేసినట్లు మాళవిక వెల్లడించింది. జిమ్నాస్టిక్స్, 'తంగలాన్' సినిమా కోసం నేర్చుకున్న కర్రసాము శిక్షణ ఈ స్టంట్ చేయడానికి తనకు ఎంతగానో ఉపయోగపడ్డాయని తెలిపింది. యాక్షన్ సీన్స్ అలవోకగా చేయడంలో సీనియర్ నటుడు విక్రమ్ ఇచ్చిన సలహాలు, తోటి నటుడు ఎస్.జె. సూర్య నటన తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని, భవిష్యత్తులో పవర్‌ఫుల్ లేడీ విలన్ పాత్రలు చేయడానికి కూడా తాను సిద్ధమేనని ప్రకటన చేసింది. కథానాయకుడు కార్తి ఎంతో జోవియల్, మంచి మనసున్న వ్యక్తి అని, తెలుగు ప్రేక్షకులకు ఆయన దత్తపుత్రుడి లాంటి వారని కొనియాడింది. గ్రాండ్ విజువల్స్, బ్యాంకాక్‌లో చిత్రీకరించిన మైండ్ బ్లోయింగ్ యాక్షన్ ఎపిసోడ్స్‌తో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన 'సర్దార్ 2' చిత్రం సెప్టెంబర్ 10న థియేటర్లలోకి వస్తోందని మాళవిక స్పష్టం చేసింది.

# రణబాలి టీజర్‌లో విజయ్ విశ్వరూపం




**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి' టీజర్‌ను చిత్రబృందం బుధవారం విడుదల చేసింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం 1854 నుంచి 1878 మధ్య కాలంలో బ్రిటిష్ పాలనలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా, ఫిక్షన్ అంశాలను జోడించి రూపొందిస్తున్నట్లు టీజర్ చూస్తే తెలుస్తోంది. ఇందులో విజయ్ దేవరకొండ విశ్వరూపం చూపించగా, కథలోని యాక్షన్, పీరియాడిక్ డ్రామా ప్రేక్షకుల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ సినిమాలో విజయ్ సరసన రష్మిక మందన్న కథానాయికగా నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ పవర్‌ఫుల్ ప్రతినాయక పాత్రలో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి టీ-సిరీస్ సమర్పణలో అజయ్-అతుల్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ భారీ పిరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను దసరా కానుకగా అక్టోబర్ 16న తెలుగు, హిందీతో పాటు ప్రధాన భారతీయ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.







# 'ముద్దు సీన్ ఉంటే అడల్ట్ సినిమానా?'

## 'ఎపిక్' ట్రోలింగ్‌పై నాగవంశీ స్ట్రాంగ్ కౌంటర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** యువ హీరో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటించిన 'ఎపిక్' సినిమా ట్రైలర్‌లోని రొమాంటిక్, ముద్దు సన్నివేశాలపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ట్రోలింగ్‌కు నిర్మాత సూర్యదేవర నాగవంశీ ఘాటుగా స్పందించారు. సినిమాలో ముద్దు సన్నివేశం కనిపించినంత మాత్రాన దానిని 'అడల్ట్ సినిమా'గా ముద్ర వేయడం సరికాదని అన్నారు. సినిమా పూర్తిగా చూసిన తర్వాతే దానిపై అభిప్రాయానికి రావాలని సూచించారు. 'బేబీ' తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మరోసారి జంటగా నటించిన చిత్రం 'ఎపిక్'. ఆదిత్య హాసన్ దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలతో సినిమాపై యువతలో ఆసక్తి పెరగగా.. ట్రైలర్‌లోని కొన్ని రొమాంటిక్ సన్నివేశాలపై విమర్శలు కూడా వచ్చాయి. తాజాగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో ఈ ట్రోలింగ్‌పై నాగవంశీ స్పందించారు. కార్యక్రమానికి వచ్చిన కొందరు ప్రేక్షకులను వేదికపైకి పిలిచి ట్రైలర్‌లోని రొమాంటిక్ సన్నివేశాలపై వారి అభిప్రాయాలను అడిగారు. అనంతరం సామాజిక మాధ్యమాల్లో వస్తున్న విమర్శలకు సమాధానమిచ్చారు. ఒకటి రెండు సన్నివేశాలను చూసి మొత్తం సినిమాపై ఓ నిర్ణయానికి రావడం సరికాదన్నారు. 'ఎపిక్' కేవలం రొమాంటిక్ సన్నివేశాల చుట్టూ తిరిగే చిత్రం కాదని, నేటి యువత ఆలోచనలు, ప్రేమ, భావోద్వేగాలను ప్రతిబింబించే కథగా తెరకెక్కించినట్లు చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారానికి భిన్నంగా 'ఎపిక్'ను కుటుంబ ప్రేక్షకులు కూడా కలిసి చూసి ఆస్వాదించవచ్చని నాగవంశీ తెలిపారు. సినిమాలో రొమాన్స్ కథలో భాగంగానే ఉ ంటుందని, దానిని మాత్రమే పట్టుకుని సినిమాపై ఒక అభిప్రాయానికి రావద్దన్నారు. యువతకు కనెక్ట్ అయ్యే అంశాలతో పాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే భావోద్వేగాలు కూడా ఉంటాయని పేర్కొన్నారు.

# బాలయ్య-కొరటాల మూవీలో ఇద్దరు ఐశ్వర్యలు

## మేకోవర్ చూస్తే షాకే!

## తొలి షెడ్యూల్ అక్టోబర్‌లో షురూ

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** నందమూరి బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న క్రేజీ ప్రాజెక్ట్ (ఎన్‌బీకే 112) పై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో బాలకృష్ణను కేవలం మాస్ యాంగిల్‌కే పరిమితం చేయకుండా, మ-ౕనుపెన్నడూ చూడని సరికొత్త మేకోవర్‌తో, కొత్త షేడ్స్‌లో చూపించేందుకు కొరటాల శివ ప్లాన్ చేస్తున్నారు. ఈ భారీ చిత్రానికి సంబంధించిన తొలి షూటింగ్ షెడ్యూల్ అక్టోబర్ మొదటి వారం నుంచి ప్రారంభం కానుండగా, బాలకృష్ణ లేని కీలక సన్నివేశాలు మరియు 15 రోజుల పాటు సాగే హై-వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్లను ప్రత్యేక సెట్‌లో చిత్రీకరించనున్నారు. ఇక ఈ చిత్రంలో కథానాయికగా మలయాళ నటి ఐశ్వర్య లక్ష్మి పేరును చిత్రయూనిట్ దాదాపు ఖరారు చేసినట్లు ఫిల్మ్‌నగర్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. 'సంబరాల ఏటిగట్టు'తో పాటు పలు చిత్రాల్లో నటిస్తున్న ఆమెకు బాలయ్య సరసన నటించే అవకాశం దక్కడం కెరీర్‌కు పెద్ద మలుపుగా మారనుంది. మరొక ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఈ సినిమాలో కీలకమైన 'లేడీ విలన్' పాత్ర కోసం ప్రముఖ నటి ఐశ్వర్య రాజేష్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా, ఐశ్వర్య రాజేష్ నెగెటివ్ షేడ్‌లో నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై మరింత ఉత్కంఠ నెలకొంది. ఈ నటీనటుల వివరాలపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది.







Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**